www.vishalabharati.com
epaper.vishalabharati.com

గురువారం, హైదరాబాద్
20 ఆగస్టు 2026
సంపుటి:4 సంచిక: 225

# విశాల భారతి

తెలుగు దినపత్రిక

## ఝలక్ ఇస్తారా.. సర్దుకుపోతారా!



- ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి పీఏసీ సమావేశానికి గైర్హాజరు
- సీఎం నల్లగొండ పర్యటనకు కూడా దూరం
- మంత్రి పదవి దక్కకపోవడంతో తీవ్ర అసంతృప్తి
- కోమటిరెడ్డి వర్గం బలమైన అనుచరగణం
- స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రతికూల ప్రభావం ప్రమాదం
- కేబినెట్ విస్తరణలో ప్రాధాన్యం కోసం పరోక్ష ఒత్తిడి

02



## 2028లో తెలంగాణలో బీజేపీదే పవర్

- జర్నలిస్టులందరికీ సొంత ఇళ్ల నిర్మాణ హామీ
- ఆరోగ్య భద్రత కోసం హెల్త్ కార్డులు ఇస్తామని ప్రకటన
- మీడియా ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పిస్తామని భరోసా
- డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీపై కీలక వ్యాఖ్యలు
- తెలంగాణలో అధికారమే లక్ష్యంగా బీజేపీ వ్యూహాలు

03



## ఉచిత పథకాలపై తెలంగాణ హైకోర్టు కీలక వ్యాఖ్యలు

- చట్టబద్ధత లేని పథకాలకు ప్రజాధనాన్ని ఎలా ఖర్చు చేస్తారు
- కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల స్టే ఎత్తివేతపై నేడు నిర్ణయం

03

# చేయి దాటిందా?

## 22ఏ జాబితాపై ప్రజల్లో తీవ్ర ఆగ్రహం

- పొరపాటుకు మంత్రి పొంగులేటి క్షమాపణ
- సీఎం రేవంత్ స్వయంగా కీలక సమీక్ష
- కుట్ర కోణంపై అంతర్గత విచారణ
- ప్రైవేటు భూములకు రక్షణ కల్పిస్తామన్న సీఎం
- రెండు రోజుల్లో ప్రైవేటు భూముల పరిశీలన



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** ఈ పరిణామాల మధ్య ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా 22ఏ నిషేధిత భూముల అంశంపై సమీక్ష నిర్వహించడం ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తిని ఇంటెలిజెన్స్ నివేదికలు, మీడియా కథనాల ద్వారా తెలుసుకున్న సీఎం సమస్య పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. రెవెన్యూ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ల శాఖ ఉన్నతాధికారులతో సమావేశమైన సీఎం వివాదానికి దారితీసిన పరిస్థితులపై ఆరా తీశారు. ప్రభుత్వ ఉత్తర్వులు, కోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ కొన్ని భూములు 22ఏ జాబితాలోకి ఎలా చేరాయనే అంశంపై అధికారులను ప్రశ్నించినట్లు సమాచారం. బాధ్యులుగా తేలిన అధికారులపై కఠిన చర్యలు తప్పవని సీఎం స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. దీంతో ఈ వ్యవహారంపై అధికార వర్గాల్లోనూ ఉత్కంఠ నెలకొంది. త్వరలో గ్రేటర్ హైదరాబాద్, సైబరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి కార్పొరేషన్ల ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో 22ఏ భూముల వివాదం అధికార

మిగతా 2లో..

లక్షల కోట్ల రూపాయల విలువైన ప్రైవేటు భూములు, ప్రజా ఆస్తులు 22ఏ నిషేధిత జాబితాలో చేరిన వ్యవహారం తెలంగాణలో తీవ్ర రాజకీయ దుమారం రేపుతోంది. వేలాది ఎకరాల భూములను నిషేధిత జాబితాలో చేర్చడంపై ప్రజల్లో ఆందోళన పెరగడంతో ప్రభుత్వం దిద్దుబాటు చర్యలకు శ్రీకారం చుట్టింది. ఇప్పటికే జరిగిన తప్పిదానికి రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి బహిరంగంగా క్షమాపణలు చెప్పారు. అయితే ప్రతిపక్షాలు మాత్రం క్షమాపణలతో సమస్య పరిష్కారం కాదని, బాధ్యత వహిస్తూ మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నాయి. 22ఏ జాబితా కారణంగా తమ ఆస్తులపై హక్కులు కోల్పోయే పరిస్థితి ఏర్పడిందంటూ పలువురు భూ యజమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తీసుకోబోయే తదుపరి చర్యలపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

## విద్యార్థుల గొంతు పట్టుకున్న సీఐ

- మహబూబాబాద్‌లో శక్తి స్కీమ్‌పై పాలిటెక్నిక్ విద్యార్థుల నిరసన
- కలెక్టరేట్ ముట్టడికి ప్రయత్నించిన విద్యార్థులను పోలీసులు అడ్డుకున్నారు
- సీఐ రఘుపతిరెడ్డి ఇద్దరు విద్యార్థుల గొంతు పట్టుకున్న దృశ్యాలు
- విద్యార్థులు ఊపిరాడక ఇబ్బంది పడినట్టు వైరల్ వీడియోల్లో కనిపింపు
- పోలీసుల తీరుపై సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలు
- సీఐపై చర్యలు తీసుకోవాలని హరీశ్ రావు డిమాండ్



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం తీసుకొచ్చిన శక్తి స్కీమ్‌కు వ్యతిరేకంగా పాలిటెక్నిక్ విద్యార్థులు చేపట్టిన నిరసన ఉద్రిక్తతకు దారితీసింది. పథకంపై తమ అభ్యంతరాలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు విద్యార్థులు కలెక్టరేట్ ముట్టడికి ప్రయత్నించారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని విద్యార్థులను అడ్డుకున్నారు. దీంతో నిరసన ప్రాంగణంలో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. విద్యార్థులు తమ డిమాండ్లను వినిపించేందుకు ప్రయత్నించగా, పోలీసులు వారిని వెనక్కి పంపే చర్యలు చేపట్టారు. ఈ సమయంలో చోటుచేసుకున్న ఘటనకు సంబంధించిన వీడియోలు ఇప్పుడు

మిగతా 3లో..

## రేవంత్‌కు కళ్లు నెత్తికెక్కాయా?

- పరకాల టికెట్‌పై సుస్మిత సంచలన సవాల్
- రేవూరి ప్రకాశ్‌రెడ్డిపై తీవ్ర విమర్శలు
- రేవంత్‌కు బహిరంగ హెచ్చరిక
- కాంగ్రెస్‌లో అచ్చ వర్సెస్ పచ్చ పోరు
- కొండా కుటుంబానికి అన్యాయం జరిగిందని ఆరోపణ
- కుటుంబ స్కామ్‌లు బయటపెడతానన్న వార్నింగ్

02



## సీఎం విజయ్ బాటలో కవిత



- కవిత కొత్త రాజకీయ అడుగులు
- జ్యోతిష్యుడితో కీలక భేటీ
- తెలంగాణ రక్షణ సేనపై వ్యూహాలు
- పార్టీ భవిష్యత్తుపై ఆరా
- ఎన్నికల ముహూర్తాలపై చర్చ
- కల్వకుంట్ల కుటుంబంలో జ్యోతిష్య విశ్వాసం

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** తెలంగాణ రాజకీయాల్లో మరో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. బీఆర్ఎస్ నుంచి బహిష్కరణకు గురైన మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కొత్త రాజకీయ వేదికతో తనదైన ముద్ర వేసేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. తెలంగాణ రక్షణ సేన పేరుతో ఏర్పాటు చేసిన వేదికను క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడం, ప్రజల్లో విస్తృత ఆదరణ సాధించడం, రానున్న ఎన్నికల్లో కీలక శక్తిగా

మిగతా 3లో..

## గాదె ఇన్నయ్యకు బెయిల్

- రూ.25 వేల అదనపు పూచీకత్తు
- రెండు షూరిటీ బాండ్లు సమర్పణ
- ప్రతి శుక్రవారం పోలీస్ స్టేషన్‌లో హాజరు
- డిసెంబర్ 21న ఎన్ఐఏ అరెస్ట్
- 8 నెలల తర్వాత జైలు నుంచి విడుదల

03





## కబ్జా కోరల్లో రూ. 400 కోట్ల ప్రభుత్వ స్థలం

- భూముల ధరల పెరుగుదలతో ప్రభుత్వ స్థలాలపై కన్ను
- ఎస్సీ కాలనీ-దెందుకూరు మధ్య 5 కిలోమీటర్ల డొంక
- గతంలో 100 అడుగుల వెడల్పు.. ప్రస్తుతం కొన్ని చోట్ల 20 అడుగులు
- గజం ధర రూ.1 లక్ష నుంచి రూ.1.50 లక్షల వరకు
- డొంక ప్రభుత్వ భూమి విలువ రూ.400 కోట్లకు పైగా అంచనా
- సర్వే చేసి హద్దులు గుర్తించాలని స్థానికుల డిమాండ్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** తెలంగాణ ఆవిర్భావం తర్వాత పట్టణ ప్రాంతాల్లో భూముల ధరలకు భారీగా రెక్కలు వచ్చాయి. ప్రధాన రహదారులు, వాణిజ్య కేంద్రాలకు సమీపంలోని స్థలాల విలువ వేగంగా పెరిగింది. ఈ పరిస్థితిని కొందరు అక్రమార్కులు తమకు అనుకూలంగా మలుచుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఖాళీగా కనిపించే ప్రభుత్వ స్థలాలను గుర్తించి, మొదట వాటి పక్కన ఉన్న కొద్దిపాటి ప్రైవేట్

మిగతా 3లో..



## 600వ టెస్ట్ విజయం

- టీమిండియాకు చాలా స్పెషల్
- దేవదత్ పడిక్కల్ ఇన్నింగ్సే మా గెలుపును శాసించింది
- రెండో ఇన్నింగ్స్ వైఫైర్యంపై మాకు ఎలాంటి టెన్షన్ లేదు
- శ్రీలంకపై ఘన విజయం తర్వాత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఇంట్రెస్టింగ్ కామెంట్స్

02

## బ్యాంకులే రైతుల వద్దకు వెళ్లి రుణాలు అందించాలి

- తెలంగాణ రైజింగ్ 2047కు బ్యాంకింగ్ రోడ్‌మ్యాప్ అవసరం
- బ్యాంకర్ల సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**తెలంగాణ బ్యూరో:**

తెలంగాణను 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ల, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే లక్ష్యంలో బ్యాంకింగ్, ఆర్థిక రంగాలు కీలక భాగస్వాములుగా నిలవాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు పిలుపునిచ్చారు. మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో జరిగిన 50వ రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాష్ట్ర సమగ్ర ఆర్థికాభివృద్ధికి అనుగుణంగా తెలంగాణ రైజింగ్ 2047 బ్యాంకింగ్ రోడ్‌మ్యాప్ రూపొందించాలని డిప్యూటీ సీఎం సూచించారు. వ్యవసాయం, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, స్టార్టప్‌లు,

మిగతా 7లో..



## బెట్టింగ్ యాప్‌ల ప్రమోషన్ కేసు

- ఈడీ ఎదుట హాజరైన నిధి అగర్వాల్
- నాలుగు గంటల పాటు ప్రశ్నించిన ఈడీ

02

## విద్యార్థుల గొంతు పిసికి చంపేస్తరా రేవంత్?

- 70 వేల ఉద్యోగాలపై ప్రశ్న
- 6 వేల సర్వేయర్లకు జీతాలు లేవు
- నాలుగు నెలలుగా వేతన బకాయిలు
- ఇద్దరు సర్వేయర్లు ఆత్మహత్యల ఆరోపణ
- సౌకర్యాలు కూడా కరువు
- అసెంబ్లీలో పోరాటానికి హామీ



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** రాష్ట్రంలో 70 వేల ఉద్యోగాలు ఇచ్చామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పదేపదే చెబుతున్నా, ఆ ఉద్యోగాల జాబితాలో ఉన్న 6 వేల మంది లైసెన్స్‌డ్ సర్వేయర్ల పరిస్థితి మాత్రం దారుణంగా ఉందని మాజీ మంత్రి,

మిగతా 2లో..

# రేవంత్‌కు కళ్లు నెత్తికెక్కాయా?

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలు రోజురోజుకు బహిర్గతమవుతున్నాయి. నల్లగొండలో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ మధ్య బహిరంగ విమర్శలు చోటుచేసుకున్నాయి. వనపర్తిలో సీనియర్ నేత చిన్నారెడ్డి, ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మధ్య విభేదాలు కనిపిస్తున్నాయి. బాన్సువాడలో పోచారం శ్రీనివాస్‌రెడ్డికి వ్యతిరేకంగా ఏనుగు రవీందర్‌రెడ్డి చేస్తున్న విమర్శలు వర్గపోరును బయటపెడుతున్నాయి. ఆదిలాబాద్‌లో ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు, ఆయన వ్యతిరేక వర్గం మధ్య రచ్చ కొనసాగుతోంది. జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి సైతం ప్రభుత్వ పనితీరుపై తరచూ ప్రశ్నలు సంధిస్తున్నారు. వరంగల్‌లో మంత్రి కొండా సురేఖకు ఇతర ఎమ్మెల్యేలతో పొసగడం లేదన్న చర్చ సాగుతోంది. ఈ పరిస్థితుల్లో పరకాల రాజకీయాలు మరింత వేడెక్కాయి. సీఎం రేవంత్‌రెడ్డి పరకాల సభలో వచ్చే ఎన్నికల్లో రేవూరి ప్రకాశ్‌రెడ్డిని గెలిపించాలని ప్రజలను కోరడం కొత్త వివాదానికి దారితీసింది. దీనిపై మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత బహిరంగంగా తీవ్ర స్థాయిలో స్పందించారు. వచ్చే ఎన్నికల్లో పరకాల నుంచి తానే పోటీ చేస్తానని, తానే గెలుస్తానని ప్రకటించారు. కాంగ్రెస్ టికెట్ రాకపోయినా స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగుతానని స్పష్టం చేశారు. రేవూరి ప్రకాశ్‌రెడ్డితో ఇప్పుడే రాజీనామా చేయించి, తాను గెలిచి చూపిస్తానని రేవంత్‌రెడ్డికి సవాల్ విసిరారు. పరకాల నియోజకవర్గంలో తన రాజకీయ బలం ఏమిటో ఎన్నికల్లో చూపిస్తానని కార్యకర్తల సమక్షంలో ప్రకటించారు. కొండా సురేఖ పుట్టినరోజు వేడుకల్లో కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడిన సుస్మిత, రేవంత్‌రెడ్డి వైఖరిపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. జెన్‌జీకి టికెట్లు ఇవ్వాలని చెబుతూ, పరకాలలో 80 ఏళ్ల వ్యక్తికి టికెట్ ఇస్తానడం విరుద్ధంగా ఉందని విమర్శించారు. నువ్వొచ్చినా, నీ తండ్రి వచ్చినా, నీ తాత వచ్చినా పరకాల ఎమ్మెల్యేను తానే అవుతానని వ్యాఖ్యానించారు. ఈసారి గెలిచి 20 ఏళ్లు ఎమ్మెల్యేగా కొనసాగుతానని, త్వరలో పరకాలలో ఇల్లు నిర్మించుకుంటానని చెప్పారు. గత ఎన్నికల్లో రేవూరి ప్రకాశ్‌రెడ్డి గెలుపు కోసం కొండా మురళి ప్రచారం చేసిన విషయాన్ని గుర్తుచేశారు. కొండా కుటుంబ సహకారంతోనే ఆ విజయం సాధ్యమైందని సుస్మిత పేర్కొన్నారు. టికెట్ల విషయంలో కాంగ్రెస్ అధిష్ఠానం నిర్ణయం తీసుకుంటుందని చెబుతున్న రేవంత్‌రెడ్డి, పరకాలకు వచ్చి రేవూరిని గెలిపించాలని చెప్పడం ఏంటని సుస్మిత ప్రశ్నించారు.



సంగారెడ్డిలో జగ్గారెడ్డికి టికెట్ అధిష్ఠానం నిర్ణయిస్తుందని చెప్పి, పరకాలలో మాత్రం అభ్యర్థిని ముందుగానే ప్రకటించడం ఎందుకని నిలదీశారు. 119 నియోజకవర్గాలకు తానే టికెట్లు ఇవ్వగలిగితే అధిష్ఠానం అవసరం ఏమిటని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్‌లో అచ్చ కాంగ్రెస్, పచ్చ కాంగ్రెస్ అంటూ వర్గాలు ఏర్పడ్డాయని ఆరోపించారు. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహా పలువురు నేతలు సంతోషంగా లేరని చెప్పారు. బీసీ ఎమ్మెల్యేలు, కొత్త ఎమ్మెల్యేలకు రేవంత్‌రెడ్డి తగిన ప్రాధాన్యం ఇవ్వడం లేదని విమర్శించారు. కొండా కుటుంబాన్ని రాజకీయంగా అణగదొక్కే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. రేవంత్‌రెడ్డి రాజకీయ ఎదుగుదలలో కొండా కుటుంబం పాత్రను సుస్మిత ప్రస్తావించారు. పీసీసీ అధ్యక్ష పదవి కోసం తన తల్లి కొండా సురేఖ మద్దతు ఇచ్చారని చెప్పారు. పీసీసీ అధ్యక్షుడైన సమయంలో తమ కుటుంబానికి ఎమ్మెల్సీ హామీ ఇచ్చారని, సీఎం అయిన తర్వాత మాట తప్పారని ఆరోపించారు. వేం నరేందర్‌రెడ్డి సలహాలపై కూడా ఆమె ప్రశ్నలు సంధించారు. రేవంత్‌రెడ్డి కుటుంబానికి చెందిన వ్యక్తులపై భూకుంభకోణ ఆరోపణలు ఉన్నాయని ప్రస్తావించారు. సీత దయాకర్‌కు పదవి ఇచ్చిన అంశాన్ని ప్రశ్నిస్తూ, కొండా మురళికి ఎమ్మెల్సీ హామీ ఎందుకు అమలు కాలేదని నిలదీశారు. బీసీల పట్ల ప్రభుత్వం వివక్ష చూపుతోందని ఆరోపించారు. హైదరాబాద్‌లో జరిగిన ఇందిరమ్మ ఇళ్ల కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌కు తగిన ప్రాధాన్యం ఇవ్వలేదని కూడా విమర్శించారు. రేవంత్‌రెడ్డికి సుస్మిత చేసిన హెచ్చరికలు ఈ వ్యవహారాన్ని మరింత రాజకీయంగా మార్చాయి. తన వ్యాఖ్యలకు కౌంటర్ ఇస్తే ప్రెస్‌క్లబ్‌కు వచ్చి రేవంత్‌రెడ్డి కుటుంబానికి సంబంధించిన ఆరోపణలను బయటపెడతానని చెప్పారు. తమ్ముడి పేరుతో ఉన్న 200కోట్ల రూపాయల భూమి వ్యవహారంపై మాత్రమే మాట్లాడానని, తనను రెచ్చగొడితే మరిన్ని విషయాలు వెల్లడిస్తానని హెచ్చరించారు. రేవంత్‌రెడ్డి పదేళ్లు ముఖ్యమంత్రిగా ఉంటానని చెప్పడంపైనా ఆమె ప్రశ్నలు లేవనెత్తారు. కొడంగల్‌లో గతంలో ప్రజలు ఓడించిన నాయకుడు ఇప్పుడు దీర్ఘకాలం అధికారంలో ఉంటానని ఎలా చెబుతారని వ్యాఖ్యానించారు. పరకాల టికెట్‌పై సుస్మిత చేసిన ప్రకటన కాంగ్రెస్‌లో అంతర్గత పోరు ఎంత తీవ్రంగా మారిందో స్పష్టం చేస్తోంది. వచ్చే ఎన్నికలకు ముందే ఈ విభేదాలు మరిన్ని నియోజకవర్గాలకు విస్తరించే అవకాశం ఉందన్న చర్చ రాజకీయ వర్గాల్లో కొనసాగుతోంది. ఈ పరిణామాలు కేవలం ఒక నియోజకవర్గానికి పరిమితం కావడం లేదని పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చిన ఎమ్మెల్యేల ప్రాంతాల్లో పాత కాంగ్రెస్ నేతలు, కొత్తగా చేరిన నేతల మధ్య సమన్వయ సమస్యలు కొనసాగుతున్నాయి. అధికారంలో ఉన్న పార్టీకి సాధారణంగా కనిపించే రాజకీయ అసంతృప్తి ఇప్పుడు బహిరంగ వేదికలపైకి రావడం అధిష్ఠానానికి సవాలుగా మారింది. ఎమ్మెల్యేలు, మంత్రులు, సీనియర్ నేతలు తమ తమ ప్రాంతాల్లో ఆధిపత్యం కోసం ప్రయత్నిస్తున్నారన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా సమయం ఉన్నప్పటికీ టికెట్లపై ఇప్పటి నుంచే పోటీ మొదలవడం పరిస్థితి తీవ్రతను సూచిస్తోంది. పరకాల విషయంలో సీఎం చేసిన వ్యాఖ్యలు స్థానిక సమీకరణాలను మరింత కదిలించాయి. కొండా కుటుంబం నుంచి వచ్చిన బహిరంగ ప్రతిస్పందనతో వరంగల్ కాంగ్రెస్‌లో ఉన్న విభేదాలు రాష్ట్ర స్థాయి చర్చగా మారాయి. ఈ వివాదంపై రేవంత్‌రెడ్డి ఎలా స్పందిస్తారన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. పార్టీ అధిష్ఠానం జోక్యం చేసుకుని వివాదాన్ని చల్లార్చుతుందా, లేక స్థానిక నేతలకు స్వేచ్ఛ ఇస్తుందా అన్నదే కీలక ప్రశ్నగా మారింది. టికెట్ విషయంలో తుది నిర్ణయం అధిష్ఠానానిదే అయినా, సుస్మిత తాజా ప్రకటన భవిష్యత్ రాజకీయ సమీకరణాలకు సంకేతంగా మారింది. కార్యకర్తల స్థాయిలో కూడా ఈ వివాదం చర్చనీయాంశమైంది. పరకాలలో ఎవరి నాయకత్వం బలంగా ఉందన్న ప్రశ్నకు ఎన్నికల ఫలితాలే సమాధానం ఇవ్వనున్నాయి. అప్పటివరకు మాటల యుద్ధం కొనసాగితే కాంగ్రెస్‌కు రాజకీయంగా ఇబ్బందులు తప్పవన్న అంచనాలు ఉన్నాయి. అధికార పార్టీ అంతర్గతంగా ఐక్యతను చూపాల్సిన సమయంలో నేతల బహిరంగ వ్యాఖ్యలు ప్రతిపక్షానికి కొత్త ఆయుధంగా మారే అవకాశముంది.

## బెట్టింగ్ యాప్‌ల ప్రమోషన్ కేసు

**విశాలభారతి, క్రైమ్ బ్యూరో:**

ఆన్‌లైన్ బెట్టింగ్, గేమింగ్ యాప్‌ల ప్రమోషన్‌కు సంబంధించిన కేసులో టాలీవుడ్ నటి నిధిఅగర్వాల్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు సుమారు నాలుగు గంటల పాటు ప్రశ్నించారు. విచారణలో భాగంగా ఆమె కొన్ని గేమింగ్ యాప్‌లకు చేసిన ప్రచారాలు, వాటికి సంబంధించిన ఒప్పందాలు, చెల్లింపుల వివరాలపై అధికారులు ఆరా తీసినట్టు తెలుస్తోంది. ప్రధానంగా 'జీత్‌విన్' వంటి గేమింగ్ యాప్‌ల ప్రచారంలో ఆమె పాత్రపై ఈడీ అధికారులు ప్రశ్నలు సంధించినట్టు సమాచారం. ప్రమోషన్ ఒప్పందాలకు సంబంధించిన ఒరిజినల్ పత్రాలను పరిశీలించిన అధికారులు.. ప్రచారానికి గాను ఆమెకు అందిన పారితోషికం, ఆ మొత్తాలు ఏ విధంగా చెల్లించబడ్డాయన్న అంశాలపై వివరాలు సేకరించినట్టు తెలుస్తోంది. ముఖ్యంగా నగదు లావాదేవీలు జరిగాయా? చెల్లింపులు బ్యాంకింగ్ మార్గంలో జరిగాయా? లేక హవాలా మార్గంలో నిధులు బదిలీ అయ్యాయా? అనే కోణాల్లో అధికారులు ప్రశ్నించినట్టు సమాచారం. అయితే ఈ విచారణకు సంబంధించి అధికారికంగా పూర్తి వివరాలు వెల్లడికావాల్సి ఉంది. దేశంలో మనీలాండరింగ్, అక్రమ నిధుల బదిలీలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆన్‌లైన్ బెట్టింగ్ నెట్‌వర్క్‌లపై ఈడీ దర్యాప్తు కొనసాగిస్తోంది. ఈ క్రమంలో ఆయా యాప్‌లను ప్రమోట్ చేసిన సినీ ప్రముఖులు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లను కూడా విచారణకు పిలుస్తుంది ఈడీ. విచారణ అనంతరం ఈడీ కార్యాలయం నుంచి బయటకు వచ్చిన నిధి అగర్వాల్‌ను మీడియా ప్రతినిధులు ప్రశ్నించేందుకు ప్రయత్నించారు. అయితే ఆమె ఎలాంటి వ్యాఖ్యలు చేయకుండా నేరుగా తన కారులో వెళ్లిపోయారు.





# చేయి దాటిందా?

**మొదటిపేజీ తరువాయి**

కాంగ్రెస్‌కు రాజకీయంగా ఇబ్బందికరంగా మారే అవకాశముందని విశ్లేషణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే ప్రతిపక్షాలు ఈ అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తున్నాయి. భూముల విషయంలో ప్రభుత్వం తప్పిదం చేసిందన్న ప్రచారం బలపడితే ఎన్నికల సమయంలో ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందని కాంగ్రెస్ నాయకత్వం భావిస్తున్నట్లు సమాచారం. పరిస్థితి మరింత ముదరకముందే సీఎం రేవంత్ రెడ్డి రంగంలోకి దిగడం వెనుక రాజకీయ లెక్కలు కూడా ఉన్నాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో భూముల విలువలు భారీగా పెరిగిన నేపథ్యంలో 22ఏ జాబితా అంశం సామాన్య ప్రజల నుంచి రియల్ ఎస్టేట్ వర్గాల వరకు తీవ్ర చర్చకు దారితీసింది. ఇదే సమయంలో 22ఏ భూముల వ్యవహారం వెనుక కుట్ర కోణం ఉందా అనే అనుమానాలు కూడా తెరపైకి వచ్చాయి. వివాదానికి అసలు కారణం ఏమిటన్న దానిపై అంతర్గత విచారణకు ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. నిషేధిత భూముల పేరుతో మధ్యవర్తులు, దళారులు కమిషన్లు వసూలు చేశారా అనే అంశాన్ని కూడా పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ ఆదేశాలు ఉన్నా కొన్ని భూములు జాబితాలో చేరడం వెనుక ఎవరైనా ఉద్దేశపూర్వకంగా వ్యవహరించారా అన్న కోణంలో అధికారులు వివరాలు సేకరిస్తున్నారు. మంత్రి వెంకట్ రెడ్డి సైతం ఈ వివాదం వెనుక కుట్ర ఉందని గతంలోనే సీఎంకు సమాచారం ఇచ్చినట్లు చెప్పడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. దీంతో ఈ అంశం కేవలం పరిపాలనా తప్పిదమా, లేక వ్యవస్థలోని కొందరి ప్రమేయంతో జరిగిన వ్యవహారమా అన్నది తేలాల్సి ఉంది. మరోవైపు 22ఏ జాబితాలో అసైన్డ్ భూములను చేర్చి భారీ స్థాయిలో అక్రమాలకు పాల్పడ్డారంటూ ప్రతిపక్షాలు ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేస్తున్నాయి. కొన్ని వర్గాలు 30 శాతం వరకు కమిషన్లు వసూలు చేశాయంటూ ఆరోపణలు చేస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి అధికారికంగా పూర్తి వివరాలు వెలువడాల్సి ఉంది. రాజకీయ ఆరోపణల మధ్య ప్రజల్లో తమ ఆస్తుల భద్రతపై అనుమానాలు పెరుగుతున్నాయి. తమ వద్ద చట్టబద్ధమైన పత్రాలు ఉన్నప్పటికీ రిజిస్ట్రేషన్ నిలిచిపోతే పరిస్థితి ఏంటని భూయజమానులు ప్రశ్నిస్తున్నారు. వివాదాస్పద జాబితా కారణంగా నిజమైన భూ యజమానులు ఇబ్బందులు పడకుండా స్పష్టమైన విధానం రూపొందించాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. జిల్లాల వారీగా సమగ్ర పరిశీలన పూర్తయితే అసలు తప్పిదాల పరిమాణం స్పష్టమయ్యే అవకాశం ఉంది. ప్రజల ఆస్తి హక్కులకు పూర్తి రక్షణ కల్పిస్తామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. సచివాలయంలో నిర్వహించిన సమీక్షలో 22ఏ జాబితాలో ఉన్న ప్రైవేటు భూములపై రెండు రోజుల్లో విచారణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. భూమి ప్రైవేటుదిగా నిర్ధారణ అయితే వెంటనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపట్టాలని సూచించారు. జిల్లాల వారీగా 22ఏ భూములపై సమగ్ర పరిశీలన జరిపి తప్పులు లేని తుది జాబితా రూపొందించాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రైవేటు భూముల్లో ఒక్క అంగుళం భూమికి కూడా ఇబ్బంది రానివ్వబోమని సీఎం హామీ ఇచ్చారు. భూహక్కుల విషయంలో ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. దళారులు, మధ్యవర్తులను ఆశ్రయించవద్దని సూచిస్తూ పుకార్లను నమ్మవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఇప్పుడు ప్రభుత్వం చేపట్టే చర్యలతో వివాదానికి శాశ్వత పరిష్కారం లభిస్తుందా అన్నది కీలకంగా మారింది.

# విద్యార్థుల గొంతు పిసికి చంపేస్తరా రేవంత్?

**మొదటిపేజీ తరువాయి**

బీఆర్ఎస్ నేత హరీశ్ రావు ప్రశ్నించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బాధిత సర్వేయర్లు ఆయనను కలసి తమ సమస్యలను వివరించారు. గత నాలుగు నెలలుగా ఒక్క రూపాయి జీతం కూడా అందలేదని, కుటుంబ ఖర్చులు, ఇంటి అద్దెలు, పిల్లల చదువులు, రోజువారీ అవసరాలు తీర్చడం కష్టంగా మారిందని వారు వాపోయారు. ఉద్యోగం ఉన్నా ఆదాయం లేకపోవడంతో అప్పులు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి ఎన్నిసార్లు విన్నవించినా స్పష్టమైన పరిష్కారం కనిపించడం లేదని తెలిపారు. తమకు న్యాయం జరిగేలా ప్రభుత్వం తక్షణం జీతాలు విడుదల చేయాలని వారు కోరారు. ప్రభుత్వం వెంటనే సమీక్ష నిర్వహించి, బకాయిలను ప్రతి సర్వేయర్ ఖాతాలో నేరుగా జమ చేసే విధానం అమలు చేయాలని కోరారు. వేతన చెల్లింపులపై స్పష్టమైన షెడ్యూల్ ప్రకటించాలని చెప్పారు. సర్వేయర్ల సమస్యలపై హరీశ్ రావు తీవ్రంగా స్పందించారు. ప్రభుత్వం ఉద్యోగాలు ఇచ్చామని గొప్పగా ప్రచారం చేసుకుంటున్న సమయంలో, ఆ ఉద్యోగులు నాలుగు నెలలుగా జీతాల కోసం ఎదురుచూడటం దారుణమని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా భూముల కొలతలు, సర్వే పనుల్లో కీలకంగా పనిచేస్తున్న లైసెన్స్డ్ సర్వేయర్ల సేవలను ప్రభుత్వం వినియోగించుకుంటూ, వారి వేతనాల విషయంలో నిర్లక్ష్యం చేయడం తగదని పేర్కొన్నారు. పెట్రోల్ ధరలు పెరగడంతో క్షేత్రస్థాయిలో తిరిగే ఖర్చులు భారీగా పెరిగాయని, సర్వే ద్వారా వచ్చే ఆదాయం మాత్రం చాలా స్వల్పంగా ఉందని చెప్పారు. జీతాలు సమయానికి చెల్లించడంతోపాటు హెల్త్ ఇన్సూరెన్స్, ట్రావెల్ అలవెన్స్ వంటి కనీస సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు. సర్వే వ్యవస్థ సక్రమంగా పనిచేయాలంటే సిబ్బందికి పరికరాలు, కార్యాలయ సహాయం, ప్రయాణ సదుపాయాలు అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రజల భూమి సమస్యలు త్వరగా పరిష్కరించేందుకు సర్వేయర్ల సేవలు అవసరమని గుర్తుచేశారు. సర్వేయర్లు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులు తీవ్రమైన స్థాయికి చేరాయని హరీశ్ రావు ఆరోపించారు. జీతాలు అందక తీవ్ర మనస్తాపానికి గురై ఇద్దరు యువ లైసెన్స్డ్ సర్వేయర్లు ఆత్మహత్యలు చేసుకున్నారని పేర్కొన్నారు. ఈ ఘటనలపై ప్రభుత్వం స్పందించి బాధిత కుటుంబాలకు అండగా నిలవాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల సమస్యలను కేవలం పరిపాలనా అంశంగా చూడకుండా, వారి కుటుంబాల జీవనాధారానికి సంబంధించిన విషయంగా పరిగణించాలని కోరారు. ఫీల్డ్‌లో విధులు నిర్వహించే సిబ్బందికి ప్రయాణ ఖర్చులు, పని భద్రత, ఆరోగ్య రక్షణ, సమయానికి వేతనాలు వంటి అంశాలు ప్రాథమిక హక్కులుగా చూడాలని అన్నారు. సర్వేయర్లపై పనిభారం పెంచి, ఆదాయం లేకుండా చేయడం అన్యాయమని విమర్శించారు. ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోకపోతే పరిస్థితి మరింత తీవ్రమవుతుందని హెచ్చరించారు. ఆత్మహత్యల ఆరోపణలపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి విషాద ఘటనలు పునరావృతం కాకుండా ఉద్యోగులకు సహాయ వ్యవస్థ



ఏర్పాటు చేయాలని సూచించారు. సమస్యల పరిష్కారం కోసం కలెక్టర్లను కలిసినప్పుడు కొందరి నుంచి వచ్చిన స్పందనపై కూడా హరీశ్ రావు మండిపడ్డారు. జీతాలు లేవని, ఖర్చులు భరించలేకపోతున్నామని చెప్పిన ఉద్యోగులకు 'అడుక్కోండి లేదా లంచాలు తీసుకోండి' అనే తరహాలో సమాధానాలు ఇవ్వడం బాధ్యతారాహిత్యమని విమర్శించారు. ప్రభుత్వ ఉద్యోగ వ్యవస్థలో పనిచేసే సిబ్బందికి ఇలాంటి మాటలు చెప్పడం వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తుందని అన్నారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ప్రతి సందర్భంలో గౌరవప్రదమైన స్పందన రావాలని, పరిష్కారానికి స్పష్టమైన కాలపరిమితి ప్రకటించాలని డిమాండ్ చేశారు. సర్వేయర్లకు సంబంధించిన బకాయిలను వెంటనే చెల్లించడంతోపాటు భవిష్యత్తులో వేతనాలు ఆలస్యం కాకుండా శాశ్వత వ్యవస్థ ఏర్పాటు చేయాలని సూచించారు. క్షేత్రస్థాయి సేవలపై ఆధారపడే ప్రజలకు ఇబ్బందులు రాకుండా సర్వే విభాగాన్ని బలోపేతం చేయాలని కోరారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఉద్యోగులు కార్యాలయాల చుట్టూ తిరగకూడదని అన్నారు. ప్రతి జిల్లాలో నోడల్ అధికారిని నియమించి, సర్వేయర్ల ఫిర్యాదులను నమోదు చేసి పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సర్వేయర్లు తమ హక్కుల కోసం పోరాటాన్ని మరింత తీవ్రతరం చేయాలని హరీశ్ రావు పిలుపునిచ్చారు. ఢిల్లీలో జరిగిన ఆందోళనల తరహాలో తెలంగాణలో కూడా నిరసనలు ఉధృతమయ్యే పరిస్థితి రావొచ్చని హెచ్చరించారు. ఇటీవల జెన్‌జీ చేపట్టిన ఆందోళనల నేపథ్యంలో కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. ఆందోళనకు దిగే ముందు ప్రభుత్వం సమస్యలను పరిష్కరించేందుకు అవకాశం ఉందని, ఉద్యోగుల సహనాన్ని పరీక్షించవద్దని సూచించారు. రాష్ట్రంలోని 6 వేల మంది సర్వేయర్లు ఒక్కసారిగా ఉద్యమిస్తే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలు ఆ నిరసన తాకిడిని తట్టుకోలేరని హెచ్చరించారు. ప్రజాస్వామ్య పద్ధతిలో జరిగే పోరాటానికి బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతు ఇస్తుందని తెలిపారు. ఉద్యోగుల సమస్యలను రాజకీయ కోణంలో చూడకుండా, ప్రభుత్వ బాధ్యతగా పరిష్కరించాలని హరీశ్ రావు సూచించారు. సర్వేయర్లు డిమాండ్లు వినిపిస్తే ప్రభుత్వం చర్చలకు పిలిచి, అంగీకరించిన అంశాలపై రాతపూర్వక హామీ ఇవ్వాలని కోరారు. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో లైసెన్స్డ్ సర్వేయర్ల సమస్యలను బలంగా ప్రస్తావించి, ప్రభుత్వాన్ని నిలదీస్తామని హరీశ్ రావు స్పష్టం చేశారు.

# ఝులక్ ఇస్తారా.. సర్దుకుపోతారా!

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

యాదాద్రి జిల్లా కాంగ్రెస్ ప్రాదేశిక వ్యవహారాల కమిటీ సమావేశానికి మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తో పాటు నియోజకవర్గ ముఖ్య నేతలు గైర్హాజరు కావడం రాష్ట్ర పార్టీ వర్గాల్లో హాట్ టాపిక్ గా మారింది. కేవలం పీఏసీ సమావేశానికే కాకుండా ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి నల్లగొండ జిల్లా పర్యటనకు సైతం ఆయన దూరంగా ఉండటం చూస్తుంటే ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ లో వర్గపోరు మళ్లీ తీవ్రమైందనే స్పష్టత వస్తోంది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి రాజగోపాల్ రెడ్డి మంత్రి పదవి రేసులో ఉన్నారు. ఆయన సోదరుడు వెంకటరెడ్డికి మంత్రిగా స్థానం కల్పించడంతో ఒకే కుటుంబానికి రెండు పదవులు ఇవ్వడం కుదరదనే సామాజిక రాజకీయ సమీకరణాలతో రాజగోపాల్ రెడ్డికి తీవ్ర నిరాశ ఎదురైంది. రాహుల్ గాంధీ నాయకత్వంలో పార్టీలోనే ఉంటానని బహిరంగంగా చెబుతున్నప్పటికీ పీసీసీ నిర్ణయాలను రాష్ట్ర వ్యవహారాల ఇన్ చార్జ్ మీనాక్షి నటరాజన్ పర్యటనను ఆయన లెక్కలోకి తీసుకుంటున్నట్లు లేదు. మునుగోడు క్యాడర్ అంతా ఒక్కటై పీసీసీ మీటింగ్ కు డుమ్మా కొట్టడం వెనుక రాజగోపాల్ రెడ్డికి తగిన ప్రాధాన్యం దక్కడం లేదనే నిరసనను అధిష్ఠానానికి స్పష్టంగా తెలియజెప్పే వ్యూహమే ఉందనే టాక్ ఉంది. నల్లగొండ రాజకీయాల్లో దశాబ్దాలుగా కోమటిరెడ్డి సోదరులకు పట్టు ఉంది. నల్లగొండ భువనగిరి మునుగోడు ప్రాంతాల్లో కోమటిరెడ్డి సోదరులకు బలమైన అనుచరగణం ఉంది. పైగా జిల్లాలో ఎప్పటి నుంచో ఉత్తమ్ జానారెడ్డి కోమటిరెడ్డి వర్గాల మధ్య తీవ్ర ఆధిపత్య పోరు నెలకొంది. స్థానిక సంస్థల పదవులు నియోజకవర్గ నిధుల కేటాయింపులో తమ వర్గానికి అన్యాయం జరుగుతుందనే భావన రాజగోపాల్ రెడ్డి వర్గంలో ఉందనేది కొట్టిపారేయలేని నిజం. ఇంత జరుగుతున్నా పీసీసీ గానీ



కాంగ్రెస్ అధిష్ఠానం గానీ రాజగోపాల్ రెడ్డిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడానికి ప్రధాన కారణం ప్రజల్లో బలమే. చర్యలు తీసుకుంటే జిల్లాలో పార్టీ అంతర్గత విభేధాలు మరింత రచ్చకెక్కుతాయని స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రభావం పడుతుందని అధిష్ఠానం వేచి చూసే ధోరణిని అవలంబిస్తోంది. రాజగోపాల్ రెడ్డి అసంతృప్తి వ్యవహారం పార్టీకి కేవలం అంతర్గత విభేదంగానే కాక రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల ఎంపీటీసీ జెడ్పీటీసీపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపే ప్రమాదం ఉంది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ముఖ్యంగా మునుగోడు లో రాజగోపాల్ రెడ్డికి సొంత అనుచర గణంతో పాటు క్షేత్రస్థాయిలో బలమైన ఓటు బ్యాంక్ ఉంది. అధిష్ఠానంతో విభేదాలు ఇలాగే కొనసాగితే అధికారిక అభ్యర్థులకు రాజగోపాల్ రెడ్డి వర్గం నుంచి సహకారం లభించకపోవడమే కాకుండా పరోక్షంగా క్రాస్ ఓటింగ్ స్వతంత్ర అభ్యర్థుల మద్దతు పెరిగే అవకాశాలు లేకపోలేదు. ఇప్పటికే గ్రామాల్లో ద్వితీయ శ్రేణి నేతలు అధినాయకత్వ ధోరణిపై అసంతృప్తితో ఉండటంతో వారిని ఏకం చేసి ఎన్నికల బరిలోకి దింపితే ఇతర పార్టీలు ప్రయోజనం పొందే అవకాశం ఉంది. స్థానిక పోరులో పట్టు సాధించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ముందుకెళ్తుండగా విభేదాలను తక్షణమే చల్లార్చకపోతే జిల్లాలో తగిన మూల్యాన్ని చెల్లించుకోవాల్సి వస్తుందని చర్చ రాజకీయ విశ్లేషకుల్లో జరుగుతోంది. ప్రస్తుతానికి రాజగోపాల్ రెడ్డి పార్టీ మారే ఆలోచనలో లేనప్పటికీ వరుస దుమ్మాల ద్వారా రాష్ట్ర నాయకత్వంపై పరోక్ష ఒత్తిడి పెంచుతున్నారు. రాబోయే రోజుల్లో కేబినెట్ విస్తరణ లేదా కార్పొరేషన్ పదవుల కేటాయింపుల్లో తమ వర్గానికి తగిన ప్రాధాన్యం లభించకపోతే ఆయన ఎలాంటి నిర్ణయమైనా తీసుకునే అవకాశం ఉందనే ఊహాగానాలు రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి. అధిష్ఠానం తక్షణమే కల్పించుకుని జిల్లాలోని సీనియర్ల మధ్య సమన్వయం కుదర్చకపోతే వర్గపోరు భవిష్యత్ లో పార్టీకి పెను సవాల్ గా మారడం ఖాయమనే చర్చ కేడర్ లో జరుగుతోంది. మునుగోడు నియోజకవర్గంలో కోమటిరెడ్డి కుటుంబ ప్రాభవం దశాబ్దాల నుంచి కొనసాగుతోంది. స్థానిక సంస్థలు జిల్లా పరిషత్ పంచాయతీల్లో వారి అనుచరులు కీలక పదవులు నిర్వహిస్తూ వచ్చారు. ప్రస్తుత ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మంత్రి పదవి ఆశలు పెరిగినా సోదరుడికి స్థానం ఇవ్వడంతో అసంతృప్తి తీవ్రమైంది. పార్టీ అధిష్ఠానం ఈ విషయాన్ని గమనిస్తూనే స్పష్టమైన చర్యలు తీసుకోకపోవడం వెనుక రాజకీయ లెక్కలు ఉన్నాయని విశ్లేషకులు చెబుతున్నారు. జిల్లాలో ఉత్తమ్ జానారెడ్డి వర్గాలతో పోటీ కొనసాగుతుండటం వల్ల ఏకపక్ష చర్యలు తీసుకోవడం కష్టమని అధిష్ఠానం భావిస్తోంది. స్థానిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో వర్గాల మధ్య సమన్వయం అవసరమని పార్టీ కార్యకర్తలు డిమాండ్ చేస్తున్నారు. రాజగోపాల్ రెడ్డి వర్గం నుంచి సహకారం లేకుంటే అధికార అభ్యర్థులు ఇబ్బంది పడే అవకాశం ఉంది. క్షేత్రస్థాయిలో ఓటు బ్యాంక్ బలంగా ఉండటం వల్ల పార్టీ నాయకత్వం జాగ్రత్తగా వ్యవహరించాల్సి వస్తోంది. ఇటీవల జరిగిన సమావేశాల్లో మునుగోడు నేతలు హాజరు కాకపోవడం పార్టీలో చర్చనీయాంశమైంది. సీఎం పర్యటనలో కూడా పాల్గొనకపోవడం అసంతృప్తిని సూచిస్తోంది. పీసీసీ నాయకత్వం ఈ పరిస్థితిని పరిష్కరించేందుకు ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ ఫలితాలు కనిపించడం లేదు. కార్పొరేషన్ పదవులు కేబినెట్ విస్తరణలో తగిన స్థానం ఇస్తే సమస్య తగ్గే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి. లేకపోతే వర్గపోరు మరింత తీవ్రమై స్థానిక ఎన్నికల్లో పార్టీకి నష్టం కలగవచ్చు. గ్రామ స్థాయిలో అసంతృప్తి నేతలు స్వతంత్రంగా పోటీ చేసే అవకాశాలు పెరుగుతున్నాయి. ఇతర పార్టీలు ఈ పరిస్థితిని ఉపయోగించుకుని లాభం పొందే అవకాశం ఉంది. అధిష్ఠానం త్వరగా జోక్యం చేసుకుని సీనియర్ నేతల మధ్య సమన్వయం కుదర్చాలని క్యాడర్ డిమాండ్ చేస్తోంది. లేనిపక్షంలో జిల్లా కాంగ్రెస్ లో అస్థిరత కొనసాగే ప్రమాదం ఉంది. రాజగోపాల్ రెడ్డి ప్రస్తుతం పార్టీలోనే ఉంటానని చెబుతున్నా వరుస నిరసనల ద్వారా ఒత్తిడి పెంచుతున్నారు. మంత్రి పదవి కోసం వేచి చూస్తున్న ఆయనకు సోదరుడికి స్థానం ఇవ్వడం నిరాశ కలిగించింది. జిల్లాలో బలమైన ఓటు బ్యాంక్ ఉండటం వల్ల అధిష్ఠానం చర్యలు తీసుకోవడానికి వెనుకాడుతోంది. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్నందున విభేదాలు చల్లార్చడం అవసరం. లేకపోతే క్రాస్ ఓటింగ్ స్వతంత్ర అభ్యర్థుల మద్దతు పెరిగి పార్టీకి నష్టం కలగవచ్చు. రాజకీయ విశ్లేషకులు ఈ పరిస్థితిని గమనిస్తూ తక్షణ చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు. కేబినెట్ విస్తరణలో తగిన ప్రాధాన్యం ఇస్తే సమస్య పరిష్కారమవుతుందని అంచనా. లేని పక్షంలో వర్గపోరు పెను సవాల్ గా మారే అవకాశం ఉంది. పార్టీ అధిష్ఠానం జిల్లా సీనియర్లను కలిసి సమన్వయం కుదర్చాల్సిన అవసరం ఉంది.

# 600వ టెస్ట్ విజయం

**స్పోర్ట్స్ డెస్క్, :** దేవదత్ పడిక్కల్ అసాధారణ బ్యాటింగ్ ప్రదర్శనతోనే శ్రీలంకతో తొలి టెస్ట్‌లో విజయం సాధించామని టీమిండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ అన్నాడు. తొలి ఇన్నింగ్స్‌లో అతను అందించిన భారీ స్కోర్.. మ్యాచ్‌ను తమవైపు మలుపు తిప్పిందన్నాడు. రెండు టెస్ట్‌ల సిరీస్‌లో భాగంగా గాలే వేదికగా ఐదు రోజుల పాటు సాగిన తొలి మ్యాచ్‌లో భారత్ 165 పరుగుల భారీ తేడాతో శ్రీలంకను చిత్తు చేసింది. 372 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో భాగంగా 84/4 ఓవర్‌నైట్ స్కోర్‌తో ఆఖరి రోజు ఆటను కొనసాగించిన శ్రీలంక రెండో ఇన్నింగ్స్‌లో 206 పరుగులకు కుప్పకూలి ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. ఈ విజయంతో రెండు టెస్ట్‌ల సిరీస్‌లో భారత్ 10తో ఆధిక్యంలో నిలిచింది.

**ఈ విజయం ప్రత్యేకం..**

ఈ మ్యాచ్ అనంతరం తమ విజయంపై స్పందించిన శుభ్‌మన్ గిల్.. వర్షం ప్రభావం ఉండటంతో గెలుపు విషయంలో కాస్త కంగారు పడ్డానని తెలిపాడు. 'భారత్‌కు ఇది 600వ టెస్ట్ మ్యాచ్. ఈ గెలుపు ఎంతో ప్రత్యేకమైనది. మాకు ఎంతో సంతృప్తినిచ్చిన విజయం. ఈ గెలుపు విషయంలో మేం చాలా సౌకర్యవంతంగా ఉన్నామని భావించాను. కానీ వాతావరణం కారణంగా ఆఖరి రోజు ఆట సాగుతుందో లేదోనని కంగారు పడ్డాను. దాంతో కాస్త ఒత్తిడికి గురయ్యాం. కానీ జట్టు అద్భుతంగా డీల్ చేసింది.

**దూకుడుగా ఆడే క్రమంలో..**

మా రెండో ఇన్నింగ్స్ వైఫల్యంపై ఎలాంటి ఆందోళన లేదు. ఎందుకంటే మేం 400 పరుగులు లక్ష్యాన్ని నమోదు చేయాలనుకున్నాం. అందుకోసం కాస్త వేగంగా ఆడాం. కానీ ఇలాంటి వికెట్‌పై ఇష్టమొచ్చినట్లు పరుగులు చేయడం అంత సులువు కాదు. 4, 5వ రోజుల్లో ఎన్ని ఓవర్లు బౌలింగ్ చేయగలమనే విషయంపై మాకు క్లారిటీ లేదు. శ్రీలంకను ఎక్కువ ఓవర్లు ఆడించాలనే ఉద్దేశంతో దూకుడుగా ఆడాలని చూశాం. ఈ క్రమంలోనే త్వరగా వికెట్లు కోల్పోయాం. అయినా మేం మెరుగైన స్థితిలో నిలిచాం. అఫ్గానిస్థాన్‌తో తన తొలి మ్యాచ్‌లో మానవ్ సుతార్ అద్భుతంగా బౌలింగ్ చేశాడు. అదే జోరును ఈ మ్యాచ్‌లోనూ కొనసాగించాడు. అతను ఎంతో ప్రతిభావంతుడిగా కనిపిస్తున్నాడు. భారత్



తరఫున సుదీర్ఘ కాలం ఆడే సామర్థ్యం అతనికి ఉంది. అని పేర్కొన్నాడు.

# కబ్జా కోరల్లో రూ.400 కోట్ల ప్రభుత్వ స్థలం

**మొదటిపేజీ తరువాయి**

భూములను కొనుగోలు చేసి, తర్వాత క్రమంగా ప్రభుత్వ భూముల్లోకి చొచ్చుకెళ్తున్నారని స్థానికులు చెబుతున్నారు. ఖమ్మం జిల్లా మధిర పట్టణంలో ఇలాంటి పరిణామాలపై ప్రస్తుతం చర్చ జరుగుతోంది. పట్టణంలో వాణిజ్య కార్యకలాపాలు విస్తరించడంతో రియల్ ఎస్టేట్ డిమాండ్ పెరిగింది. ఫలితంగా ప్రభుత్వ ఆస్తులపై ఆక్రమణ ముప్పు కూడా పెరుగుతోందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. అధికార యంత్రాంగం స్పందించి ప్రభుత్వ భూముల వివరాలను బహిరంగంగా పరిశీలించాలని ప్రజలు కోరుతున్నారు. మధిర పట్టణంలోని ఎస్సీ కాలనీ నుంచి దెందుకూరు వరకు సుమారు 5 కిలోమీటర్ల పొడవున పురాతన డొంక రహదారి ఉంది. మధిర-విజయవాడ ప్రధాన రహదారికి సమీపం నుంచి సాగుతున్న ఈ మార్గం దాదాపు శతాబ్ద కాలంగా ప్రజల వినియోగంలో ఉందని స్థానికులు చెబుతున్నారు. గతంలో ప్రజల రాకపోకలకు, వ్యవసాయ అవసరాలకు ఈ దారి కీలకంగా ఉండేది. వర్షాకాలంలో పొలాలకు వెళ్లే రైతులకు, సమీప గ్రామాల ప్రజలకు ఈ మార్గం ఉపయోగపడేది. కాలక్రమంలో పట్టణ విస్తరణ పెరిగి రహదారి చుట్టూ నిర్మాణాలు, స్థలాల కొనుగోళ్లు పెరిగాయి. దీంతో డొంకకు ఆనుకుని ఉన్న భూములకు కూడా భారీగా విలువ వచ్చింది. ప్రస్తుతం ఈ పురాతన మార్గం కేవలం రాకపోకల దారిగా కాకుండా విలువైన ప్రభుత్వ ఆస్తిగా మారిపోయిందని స్థానికులు పేర్కొంటున్నారు. ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న ప్రాంతాల్లో భూముల ధరలు పెరగడంతో డొంక పరిధిలోని ప్రభుత్వ భూమిపై ఆక్రమణదారుల దృష్టి పడిందన్న ఆరోపణలు ఉన్నాయి. మొదట డొంకకు ఆనుకుని ఉన్న ప్రైవేట్ స్థలాలను కొనుగోలు చేసి, ఆ తర్వాత సరిహద్దులను క్రమంగా మార్చుతూ ప్రభుత్వ భూమిలోకి విస్తరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఒకప్పుడు సుమారు 100 అడుగుల వెడల్పుతో ఉన్న ఈ డొంక ప్రస్తుతం కొన్ని ప్రాంతాల్లో కేవలం 20 అడుగులకు మాత్రమే పరిమితమైందని చెబుతున్నారు. ఇలా ఆక్రమణలు కొనసాగితే భవిష్యత్తులో ప్రజలకు అందుబాటులో ఉన్న మార్గం పూర్తిగా కనుమరుగయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది.



డొంకపై హక్కులు, హద్దులు స్పష్టంగా లేకపోవడం ఆక్రమణలకు అవకాశం కల్పిస్తోందని స్థానికులు భావిస్తున్నారు. పాత రహదారి గుర్తులు, రెవెన్యూ రికార్డులు పరిశీలించి వాస్తవ పరిస్థితిని నిర్ధారించాలని వారు కోరుతున్నారు. మధిర ఎస్సీ కాలనీ నుంచి దెందుకూరు వరకు ఉన్న ఈ ప్రభుత్వ డొంక భూమికి ప్రస్తుత మార్కెట్ ధరల ప్రకారం భారీ విలువ ఉందని స్థానిక రియల్ ఎస్టేట్ వర్గాలు చెబుతున్నాయి. ఎస్సీ కాలనీ నుంచి మార్కెట్ యార్డు వరకు గజం ధర సుమారు రూ.1 లక్ష నుంచి రూ.1.50 లక్షల వరకు పలుకుతున్నట్లు సమాచారం. ఈ ధరలను పరిగణనలోకి తీసుకుంటే డొంకకు సంబంధించిన మొత్తం ప్రభుత్వ భూమి విలువ రూ.400 కోట్లకు పైగానే ఉంటుందని అంచనా వేస్తున్నారు. ప్రభుత్వ భూమి విలువ పెరుగుతున్న కొద్దీ ఆక్రమణలకు ప్రోత్సాహం లభించే అవకాశం ఉందని ప్రజలు చెబుతున్నారు. విలువైన ప్రభుత్వ ఆస్తి భవిష్యత్తులో ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్లకుండా ముందస్తు చర్యలు అవసరమని వారు సూచిస్తున్నారు. రెవెన్యూ, మున్సిపల్ శాఖలు సమన్వయంతో భూముల స్థితిని పరిశీలిస్తే వివాదాలకు అవకాశం తగ్గుతుందని అభిప్రాయపడుతున్నారు. అధికారిక కొలతల ఆధారంగా మాత్రమే సరిహద్దులను నిర్ణయించాలని స్థానికులు కోరుతున్నారు. ప్రభుత్వ భూములకు సంబంధించి పాత రికార్డులు, పట్టాదారు వివరాలు, సర్వే నంబర్లు, మ్యాపులను సమగ్రంగా పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు. డొంకకు సంబంధించిన అసలు వెడల్పు ఎంత, ప్రస్తుతం ఎంత మేర ఆక్రమణకు గురైంది, ఏ ప్రాంతాల్లో నిర్మాణాలు వచ్చాయి అనే అంశాలపై ప్రత్యేక సర్వే నిర్వహించాల్సిన అవసరం ఉందని చెబుతున్నారు. అవసరమైతే సరిహద్దులను గుర్తిస్తూ శాశ్వత హద్దు రాళ్లు ఏర్పాటు చేయాలని సూచిస్తున్నారు. ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాలు ఉంటే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. గతంలో వినియోగంలో ఉన్న రహదారుల వివరాలను కూడా అధికారిక రికార్డుల్లో భద్రపరచాలని కోరుతున్నారు. డొంక మార్గం పూర్తిగా కనుమరుగైతే రైతులు, స్థానిక ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి వస్తుందని ఆందోళన వ్యక్తమవుతోంది. అందుకే తక్షణ సర్వే, రికార్డుల పరిశీలన, హద్దుల నిర్ధారణ ప్రక్రియ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. మధిర పట్టణం వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వ భూముల పరిరక్షణకు ప్రత్యేక ప్రణాళిక అవసరమని స్థానికులు చెబుతున్నారు. పట్టణాభివృద్ధి పేరుతో విలువైన ప్రభుత్వ ఆస్తులు కనుమరుగైతే భవిష్యత్తులో ప్రజా అవసరాలకు స్థలాలు కొరత ఏర్పడే ప్రమాదం ఉంది. పురాతన డొంక రహదారి విషయంలో కూడా ఇదే పరిస్థితి తలెత్తకుండా అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి, ప్రభుత్వ భూమి హద్దులను స్పష్టంగా గుర్తిస్తే ఆక్రమణలపై వస్తున్న ఆరోపణలకు కూడా స్పష్టత వస్తుంది. రహదారి ప్రయోజనం, ప్రభుత్వ ఆస్తి పరిరక్షణ, స్థానికుల రాకపోకల అవసరాలను దృష్టిలో ఉంచుకుని శాశ్వత పరిష్కారం చూపాలని వారు కోరుతున్నారు. భవిష్యత్తులో ఈ ప్రాంతంలో భూముల ధరలు మరింత పెరిగే అవకాశం ఉన్నందున ఇప్పుడే ప్రభుత్వ రికార్డులను నవీకరించి, ఆక్రమణలకు తావులేని విధంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ప్రజా ఆస్తి రక్షణలో నిర్లక్ష్యం చోటుచేసుకోకుండా అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రభుత్వ స్థలాల రక్షణకు ప్రత్యేక రిజిస్టర్ నిర్వహించడం, సరిహద్దుల వివరాలను డిజిటల్ రికార్డుల్లో నమోదు చేయడం, ప్రజలకు అందుబాటులో ఉంచడం ఉపయోగకరంగా ఉంటుందని నిపుణులు సూచిస్తున్నారు. ఆక్రమణలకు సంబంధించిన ఫిర్యాదులను స్వీకరించేందుకు ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేస్తే సమస్యలను త్వరగా గుర్తించే అవకాశం ఉంటుంది. స్థానిక ప్రజాప్రతినిధులు, రెవెన్యూ సిబ్బంది, మున్సిపల్ అధికారులు కలిసి క్షేత్రస్థాయి పరిశీలనలు నిర్వహిస్తే డొంక పరిస్థితిపై స్పష్టమైన నివేదిక సిద్ధమవుతుంది. ప్రభుత్వ భూమి పరిరక్షణ కేవలం ఆక్రమణలను అడ్డుకోవడానికే పరిమితం కాకుండా భవిష్యత్ ప్రజా అవసరాల కోసం ఆస్తిని కాపాడే చర్యగా ఉండాలని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. రహదారి వినియోగ చరిత్రను పరిగణనలోకి తీసుకుని ప్రజా ప్రయోజనాన్ని కాపాడే నిర్ణయం తీసుకోవాలని వారు కోరుతున్నారు. ఇలాంటి చర్యలు చేపడితే భవిష్యత్తులో వివాదాలు తగ్గడంతో పాటు ప్రభుత్వ ఆస్తులపై నిఘా బలోపేతమవుతుంది. మధిరలో ప్రస్తుతం ఉన్న భూముల విలువ దృష్ట్యా ఇది అత్యవసరంగా చేపట్టాల్సిన ప్రక్రియగా స్థానికులు పేర్కొంటున్నారు.

## సీఎం విజయ్ బాటలో కవిత

**మొదటిపేజీ తరువాయి**



ఎదగడం లక్ష్యంగా వ్యూహరచన సాగుతున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లో ప్రముఖ జ్యోతిష్యుడు రికీ రాధన్ పండిట్ వెట్రివేల్‌తో కవిత సమావేశం కావడం చర్చనీయాంశంగా మారింది. సాధారణ మర్యాదపూర్వక భేటీ కంటే ఈ సమావేశానికి రాజకీయ ప్రాధాన్యం ఎక్కువగా ఉందన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. కొత్త పార్టీ ప్రయాణానికి అనుకూల పరిస్థితులు, ఎదురయ్యే సవాళ్లు, భవిష్యత్ కార్యాచరణపై పండిట్‌తో కవిత సుదీర్ఘంగా చర్చించినట్లు సమాచారం. అయితే సమావేశానికి సంబంధించిన పూర్తి వివరాలు అధికారికంగా వెల్లడికాలేదు. కవిత అడుగులు ఇప్పుడు రాజకీయ పరిశీలనకు గురవుతున్నాయి.తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో జ్యోతిష్యం, వాస్తు, యాగాలపై నేతలకు ఉన్న విశ్వాసం కొత్త విషయం కాదు. ముఖ్యంగా కల్వకుంట్ల కుటుంబంలో ఈ సంప్రదాయాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఉన్నట్లు గత పరిణామాలు సూచించాయి. తెలంగాణ ఉద్యమ కాలం నుంచి అధికారంలో ఉన్న దశ వరకు కేసీఆర్ పలు సందర్భాల్లో చండీ యాగాలు, సుదర్శన యాగాలు నిర్వహించారు. కీలక రాజకీయ కార్యక్రమాలకు ముహూర్తాలు నిర్ణయించడం, పార్టీ కార్యక్రమాలకు శుభసమయాలు ఎంపిక చేయడం వంటి అంశాల్లో పండితుల సలహాలు తీసుకున్న సందర్భాలు గతంలో కనిపించాయి. ఇప్పుడు కవిత కూడా తన కొత్త రాజకీయ ప్రస్థానానికి గ్రహబలం, దైవబలం తోడైతే రాజకీయంగా అనుకూల ఫలితాలు సాధించవచ్చనే నమ్మకంతో ముందుకు సాగుతున్నారన్న చర్చ మొదలైంది. ఇదే కారణంతో పండిట్ వెట్రివేల్‌ను కలిసినట్లు రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. అయితే ఈ భేటీ వెనుక ఉన్న ఉద్దేశంపై కవిత నుంచి స్పష్టమైన ప్రకటన రావాల్సి ఉంది. కుటుంబ వారసత్వం నుంచి స్వతంత్ర గుర్తింపు సాధించాలన్న ప్రయత్నంగా దీనిని కొందరు చూస్తున్నారు. రికీ రాధన్ పండిట్ వెట్రివేల్ రాజకీయ జ్యోతిష్య విశ్లేషణలతో గుర్తింపు పొందిన వ్యక్తిగా ప్రచారంలో ఉన్నారు. ప్రాంతీయ రాజకీయాలు, ఎన్నికల పరిణామాలు, నాయకుల రాజకీయ భవిష్యత్తుపై ఆయన చేసే అంచనాలు సామాజిక మాధ్యమాల్లో చర్చకు వస్తుంటాయి. తమిళనాడులో నటుడు విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం భవిష్యత్తుపై ఆయన చేసిన విశ్లేషణలు గతంలో రాజకీయ వర్గాల దృష్టిని ఆకర్షించాయి. ఈ నేపథ్యంలో కవిత ఆయనను కలవడం సహజంగానే ఆసక్తి రేకెత్తించింది. కొత్తగా ఏర్పాటు చేస్తున్న రాజకీయ వేదికకు ప్రజాదరణ ఎలా పెంచాలి, ఏ ప్రాంతాలపై ముందుగా దృష్టి పెట్టాలి, ఎన్నికల సమయంలో కీలక నిర్ణయాలకు అనుకూల సమయాలు ఏవి వంటి అంశాలపై చర్చ జరిగి ఉండొచ్చని ప్రచారం సాగుతోంది. పార్టీ పేరు, కార్యక్రమాలు, ప్రచార ప్రారంభం, ముఖ్య సమావేశాలు వంటి అంశాలకు ముహూర్తాలపై సలహాలు తీసుకున్నారా అనే ప్రశ్నలు కూడా రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్నాయి. అధికారిక ధృవీకరణ మాత్రం లేదు. ఎన్నికల అంచనాలు, నాయకత్వ అవకాశాలపై చర్చ జరిగిందనే ప్రచారం సాగుతోంది. తెలంగాణ రక్షణ సేనను కేవలం రాజకీయ ప్రకటనగా పరిమితం చేయకుండా, ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కవిత కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. క్షేత్రస్థాయిలో కార్యకర్తలను సమీకరించడం, యువతను ఆకర్షించడం, మహిళలు, రైతులు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఉద్యమాలు నిర్వహించడం వంటి అంశాలపై దృష్టి పెట్టే అవకాశముంది.

## విద్యార్థుల గొంతు పట్టుకున్న సీఐ



**మొదటిపేజీ తరువాయి**

సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా చక్కర్లు కొడుతున్నాయి. విద్యార్థుల నిరసనకు సంబంధించిన అంశం క్రమంగా రాజకీయ చర్చకు కూడా దారి తీస్తోంది. పథకంపై ఉన్న సందేహాలను ప్రభుత్వం స్పష్టంగా వివరించాలని విద్యార్థులు కోరుతున్నట్టు సమాచారం. ఈ పరిణామంతో విద్యార్థుల్లో ఆందోళన పెరగగా, అధికారులు వెంటనే స్పందించాలని కోరుతున్నారు. నిరసనను నియంత్రించే క్రమంలో సీఐ రఘుపతిరెడ్డి వ్యవహరించిన తీరు ప్రస్తుతం ప్రధాన చర్చనీయాంశంగా మారింది. వైరల్ అవుతున్న వీడియోల్లో ఇద్దరు విద్యార్థుల గొంతును సీఐ తన చేతులతో పట్టుకుని వెనక్కి నెట్టిన దృశ్యాలు కనిపిస్తున్నాయి. ఈ సమయంలో విద్యార్థులు ఊపిరాడక ఇబ్బంది పడుతున్నట్టుగా వీడియోలో కనిపించడంతో ఘటనపై ఆందోళన వ్యక్తమవుతోంది. పోలీసు విధుల్లో శాంతిభద్రతలను కాపాడటం కీలక బాధ్యత అయినప్పటికీ, నిరసనకు వచ్చిన విద్యార్థుల పట్ల బలప్రయోగం ఎంతవరకు సమంజసమన్న ప్రశ్నలు ఇప్పుడు తెరపైకి వచ్చాయి. వీడియోలో కనిపిస్తున్న దృశ్యాలపై పూర్తి వాస్తవాలను అధికారులు వెల్లడించాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఘటన సమయంలో అక్కడ ఉన్న ఇతర పోలీసుల పాత్ర, విద్యార్థుల ప్రవర్తన, పరిస్థితుల తీవ్రత వంటి అంశాలపై కూడా సమగ్రంగా పరిశీలన జరగాలని డిమాండ్లు వినిపిస్తున్నాయి. నిరసన హక్కు ఉన్నప్పటికీ, శారీరకంగా ఇబ్బంది కలిగించే చర్యలు వివాదానికి కారణమయ్యాయి. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పోలీసు శాఖ తీరుపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విద్యార్థులపై ఇంత కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఏమొచ్చిందని నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు. పోలీసులు రక్షణ కల్పించాల్సిన వారేనా, లేక ఆందోళనకారులను అణచివేసే రీతిలో వ్యవహరించాలా అంటూ పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ముఖ్యంగా యువ విద్యార్థులతో వ్యవహరించే సమయంలో అధికారులు మరింత సంయమనంతో వ్యవహరించాల్సి ఉంటుందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. శాంతియుత నిరసనకు అవకాశం కల్పించడం, వారి అభ్యంతరాలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడం ప్రజాస్వామ్య వ్యవస్థలో కీలకమని పలువురు గుర్తుచేస్తున్నారు. అదే సమయంలో వీడియో ఆధారంగా మాత్రమే తుది నిర్ణయానికి రాకుండా, పూర్తి ఘటనపై అధికారిక విచారణ జరగాలని మరికొందరు సూచిస్తున్నారు. వైరల్ దృశ్యాలపై ప్రజల్లో ఏర్పడిన అనుమానాలకు ప్రభుత్వం స్పష్టత ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో పోలీసు శాఖ స్పందన కోసం ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ వ్యవహారంపై బీఆర్ఎస్ మాజీ మంత్రి టి.హరీశ్ రావు కూడా స్పందించారు. విద్యార్థుల పట్ల అమానుషంగా వ్యవహరించిన సీఐపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న పోలీసు అధికారి విద్యార్థుల పట్ల ఈ విధంగా వ్యవహరించడం ఆమోదయోగ్యం కాదన్న భావనను వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే ఢిల్లీలోని జంతర్ మంతర్ తరహాలో జెన్ జీ నిరసనలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. ఈ వ్యాఖ్యలు ఘటనకు రాజకీయ ప్రాధాన్యతను మరింత పెంచాయి. విద్యార్థుల సమస్యను పరిష్కరించడంతో పాటు, పోలీసు అధికారి ప్రవర్తనపై విచారణ జరపాలని ప్రతిపక్ష వర్గాలు కోరుతున్నాయి. అయితే ఘటనకు సంబంధించిన అన్ని వివరాలను పరిశీలించిన తరువాతే ప్రభుత్వం తదుపరి నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. బాధిత విద్యార్థుల వాదనను నమోదు చేసి, వీడియో ఆధారాలను పరిశీలించి, ప్రత్యక్ష సాక్షుల నుంచి వివరాలు సేకరించడం ద్వారా నిజానిజాలు వెలుగులోకి రావాల్సి ఉంది. విచారణ పారదర్శకంగా జరిగితే ఘటనపై నెలకొన్న అనుమానాలకు స్పష్టత వచ్చే అవకాశం ఉంటుంది. శక్తి స్కీమ్‌పై విద్యార్థులు ఎందుకు ఆందోళనకు దిగారు, పథకం వల్ల తమకు ఎదురయ్యే సమస్యలు ఏమిటి అన్న విషయాలు కూడా ఇప్పుడు చర్చలోకి వస్తున్నాయి. నిరసనకు కారణమైన డిమాండ్లను ప్రభుత్వం విద్యార్థి సంఘాలతో చర్చించి పరిష్కరించే ప్రయత్నం చేయాలని విద్యార్థి వర్గాలు కోరుతున్నాయి. ఒకవైపు పథకం అమలుపై వివరణ అవసరమవుతుండగా, మరోవైపు నిరసన సమయంలో పోలీసుల వ్యవహార శైలిపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. విద్యార్థుల ఆందోళనను కేవలం శాంతిభద్రతల సమస్యగా చూడకుండా, వారి అభ్యంతరాల వెనుక ఉన్న కారణాలను తెలుసుకోవడం అవసరమని విద్యావర్గాలు చెబుతున్నాయి. ప్రభుత్వ అధికారులు విద్యార్థులతో చర్చలు జరిపి, అపోహలు ఉంటే నివృత్తి చేయడం ద్వారా పరిస్థితిని చక్కదిద్దవచ్చని సూచిస్తున్నారు. నిరసన హక్కును గౌరవిస్తూ, ప్రజా భద్రతకు భంగం కలగకుండా పోలీసు చర్యలు కొనసాగాల్సి ఉంటుంది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా స్పష్టమైన మార్గదర్శకాలు ఉండాలని డిమాండ్లు వస్తున్నాయి. విద్యార్థి సంఘాలు తమ డిమాండ్లపై ప్రభుత్వం అధికారిక ప్రకటన చేయాలని కోరుతున్నాయి. మహబూబాబాద్ ఘటన ఇప్పుడు విద్యార్థుల నిరసన హక్కు, పోలీసుల బాధ్యత, ప్రభుత్వ స్పందన అనే మూడు అంశాల చుట్టూ కేంద్రీకృతమైంది. వైరల్ వీడియోలపై ప్రజల్లో చర్చ పెరుగుతున్న నేపథ్యంలో అధికారికంగా ఏం జరిగిందనే విషయాన్ని ప్రభుత్వం వెల్లడించడం కీలకంగా మారింది. సీఐ రఘుపతిరెడ్డి వ్యవహారంపై శాఖాపరమైన విచారణ జరుగుతుందా, బాధ్యత నిర్ధారణ అయితే ఎలాంటి చర్యలు తీసుకుంటారన్న దానిపై కూడా ఆసక్తి నెలకొంది. మరోవైపు శక్తి స్కీమ్‌పై విద్యార్థుల అభ్యంతరాలను ప్రభుత్వం ఎంతవరకు పరిగణనలోకి తీసుకుంటుందన్నది చూడాల్సి ఉంది. ప్రజాస్వామ్యంలో విద్యార్థుల ప్రశ్నలకు సమాధానం ఇవ్వడం, నిరసనలను చట్టబద్ధంగా నిర్వహించేందుకు అవకాశం కల్పించడం ప్రభుత్వ బాధ్యతగా భావిస్తారు. అదే సమయంలో పోలీసులపై వస్తున్న ఆరోపణలను నిర్ధారించేందుకు నిష్పక్షపాత విచారణ అవసరం. విద్యార్థులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందా, లేక ఈ ఘటన మరింత పెద్ద ఆందోళనకు దారితీస్తుందా అన్నది రానున్న రోజుల్లో స్పష్టమవుతుంది. ప్రస్తుతం మాత్రం మహబూబాబాద్ ఘటనపై సామాజిక మాధ్యమాల్లో చర్చ కొనసాగుతోంది. ప్రభుత్వ నిర్ణయం ఘటనకు సంబంధించిన భవిష్యత్ పరిణామాలను నిర్ణయించే అవకాశం కనిపిస్తోంది. ఇదే ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది.

# గాదె ఇన్నయ్యకు బెయిల్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ ఉద్యమకారుడు, మాజీ మావోయిస్టు గాదె ఇన్నయ్యకు ఎన్ఐఏ కేసులో తెలంగాణ హైకోర్టు బుధవారం షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. రూ.25 వేల అదనపు పూచీకత్తుతో రెండు షూరిటీ బాండ్లను సమర్పించాలని న్యాయస్థానం ఆదేశించింది. బెయిల్ నిబంధనల్లో భాగంగా ప్రతి శుక్రవారం కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో విచారణాధికారి ఎదుట తప్పనిసరిగా హాజరుకావాలని స్పష్టం చేసింది. కోర్టు విధించిన షరతులను ఉల్లంఘించకుండా దర్యాప్తుకు సహకరించాల్సి ఉంటుంది. ఈ ఆదేశాలతో గత ఎనిమిది నెలలుగా చంచల్‌గూడ జైలులో ఉన్న ఇన్నయ్యకు బయటకు వచ్చే అవకాశం లభించింది. కేసు విచారణ కొనసాగుతున్న నేపథ్యంలో బెయిల్‌పై విడుదలకు కోర్టు నిర్దేశించిన నిబంధనలు అమల్లో ఉండనున్నాయి. మావోయిస్టు అగ్రనేతగా పేర్కొంటున్న కట్టా రామచంద్రారెడ్డి అంత్యక్రియల్లో ఇన్నయ్య పాల్గొన్న ఘటన ఆధారంగా ఎన్ఐఏ కేసు నమోదు చేసింది. అంత్యక్రియల సమయంలో ఆయన విప్లవ భావజాలాన్ని ప్రచారం చేశారని దర్యాప్తు సంస్థ ఆరోపించింది. మావోయిస్టులకు అనుకూలంగా ప్రసంగించారని, ఉద్యమాన్ని ఉసిగొల్పేలా వ్యాఖ్యలు చేశారని అభియోగాల్లో పేర్కొంది. ఈ ఆరోపణల నేపథ్యంలో దేశద్రోహ కార్యకలాపాలకు సంబంధించిన నిబంధనలతోపాటు ఉపా చట్టంలోని వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు అధికారులు వెల్లడించారు. అంత్యక్రియల సభలో చేసిన ప్రసంగం, అక్కడి కార్యకలాపాలు, సంబంధిత వ్యక్తులతో ఉన్న సంబంధాలపై దర్యాప్తు సంస్థ ఆధారాలు సేకరించినట్లు కేసు వివరాలు సూచిస్తున్నాయి. ఈ కేసులో ఇన్నయ్య పాత్రపై దర్యాప్తు కొనసాగుతోంది. ఇన్నయ్య అరెస్టుపై తెలంగాణలో పలు వర్గాల్లో చర్చ జరిగింది. బెయిల్ మంజూరుతో ఈ అంశం మళ్లీ చర్చకు వచ్చింది. ఎన్ఐఏ అధికారులు గతేడాది డిసెంబర్ 21న జనగామ జిల్లాలోని జఫర్‌గడ్‌లో ఉన్న ఇన్నయ్య ఇంటి వద్ద ఆయనను అదుపులోకి తీసుకున్నారు. అరెస్టు అనంతరం కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. అప్పటి నుంచి ఆయన న్యాయపరమైన నిర్బంధంలో కొనసాగుతున్నారు. కేసు తీవ్రత, ఆరోపణల స్వభావం, దర్యాప్తు పురోగతి వంటి అంశాలను ప్రాసిక్యూషన్ తన వాదనల్లో ప్రస్తావించినట్లు తెలిసింది. ఇన్నయ్య తరపు న్యాయవాదులు మాత్రం ఆరోపణలను ఖండిస్తూ బెయిల్ కోరారు. ఆయనపై మోపిన అభియోగాలు చట్టపరంగా నిరూపించాల్సిన అవసరం ఉందని వాదించారు. దర్యాప్తుకు సహకరించేందుకు సిద్ధంగా ఉన్నారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈ వాదనలు పరిశీలించిన హైకోర్టు, నిర్దేశిత షరతులతో బెయిల్ మంజూరు చేసింది. బెయిల్ ఉత్తర్వుల్లో భాగంగా రూ.25 వేల అదనపు పూచీకత్తుతో రెండు షూరిటీ బాండ్లు సమర్పించాలని హైకోర్టు స్పష్టం చేసింది. బెయిల్ పొందిన తరువాత కూడా ఇన్నయ్యపై పర్యవేక్షణ కొనసాగనుంది. ప్రతి శుక్రవారం కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో విచారణాధికారి ఎదుట హాజరై తన వివరాలను నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. దర్యాప్తు అధికారులు పిలిచినప్పుడు సహకరించాల్సి ఉంటుంది. కేసుకు సంబంధించిన సాక్షులను ప్రభావితం చేయడం, దర్యాప్తుకు ఆటంకం కలిగించే చర్యలకు పాల్పడకూడదనే నిబంధనలు కూడా బెయిల్ వ్యవస్థలో సాధారణంగా కీలకంగా ఉంటాయి. కోర్టు ఉత్తర్వుల్లో పేర్కొన్న షరతులను పాటించడం తప్పనిసరి. నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే బెయిల్ రద్దుకు సంబంధించి దర్యాప్తు సంస్థ న్యాయస్థానాన్ని ఆశ్రయించే అవకాశం ఉంటుంది. ఈ కేసు నేపథ్యంలో ఉపా చట్టం కింద నమోదైన ఆరోపణలపై న్యాయపరమైన చర్చ కూడా ప్రాధాన్యం సంతరించుకుంది. ఉపా చట్టం కింద కేసులు నమోదైనప్పుడు దర్యాప్తు సంస్థ సమర్పించే ఆధారాలు, నిందితుడి పాత్ర, బెయిల్‌కు వర్తించే చట్టపరమైన ప్రమాణాలను న్యాయస్థానం పరిశీలిస్తుంది. ఇన్నయ్య గత ఎనిమిది నెలలుగా హైదరాబాద్‌లోని చంచల్‌గూడ జైలులో ఉన్నారు. గతేడాది డిసెంబర్‌లో అరెస్టు చేసినప్పటి నుంచి ఆయన జైలులోనే న్యాయపరమైన నిర్బంధాన్ని ఎదుర్కొన్నారు. తాజాగా హైకోర్టు బెయిల్ మంజూరు చేయడంతో విడుదలకు మార్గం సుగమమైంది. అయితే కేసు నుంచి ఆయన పూర్తిగా విముక్తి పొందినట్లు భావించడానికి వీలు లేదు. బెయిల్ అనేది విచారణ కొనసాగుతున్న సమయంలో వ్యక్తిని నిర్బంధం నుంచి బయటకు పంపే న్యాయపరమైన ఉపశమనం మాత్రమే. అసలు కేసులో ఉన్న ఆరోపణలపై తుది నిర్ణయం విచారణ ప్రక్రియలోనే వెలువడుతుంది. ఎన్ఐఏ దర్యాప్తు కొనసాగుతున్నందున తదుపరి దశల్లో కోర్టు ముందు మరిన్ని వివరాలు సమర్పించే అవకాశం ఉంది. ఇన్నయ్యపై ఉన్న అభియోగాలపై తుది ఫలితం మాత్రం న్యాయస్థాన విచారణ అనంతరం స్పష్టమవుతుంది. ఇన్నయ్య విషయంలో కూడా ఇరు పక్షాల వాదనలు, కేసు దర్యాప్తు స్థితి, నిర్బంధ కాలం వంటి అంశాలు కోర్టు పరిశీలనకు వచ్చినట్లు తెలుస్తోంది. బెయిల్ మంజూరైనప్పటికీ కేసు విచారణలో ఆరోపణలపై తుది నిర్ధారణ జరగాల్సి ఉంది. ఈ నేపథ్యంలో హైకోర్టు విధించిన హాజరు నిబంధనకు ప్రాధాన్యం ఉంది. ప్రతి వారం పోలీస్ స్టేషన్‌కు హాజరుకావడం ద్వారా దర్యాప్తు సంస్థకు అవసరమైన సహకారం అందించాల్సి ఉంటుంది. ఇదే సమయంలో ఆయన స్వేచ్ఛను పూర్తిగా పరిమితం చేయకుండా న్యాయస్థానం సమతుల్య విధానాన్ని అనుసరించినట్లు న్యాయవర్గాలు భావిస్తున్నాయి. తెలంగాణ ఉద్యమంతో అనుబంధం ఉన్న వ్యక్తిగా ఇన్నయ్యకు గతంలో రాజకీయ, సామాజిక వర్గాల్లో గుర్తింపు ఉంది. ఆయన మాజీ మావోయిస్టుగా కూడా ప్రజా జీవితంలో ప్రస్తావనకు వచ్చారు. తాజా ఎన్ఐఏ కేసు కారణంగా ఆయన అరెస్టు, జైలు జీవితం, బెయిల్ అంశాలు మరోసారి చర్చనీయాంశమయ్యాయి. మావోయిస్టు భావజాల ప్రచారం ఆరోపణలపై దర్యాప్తు సంస్థ తన కేసును ముందుకు తీసుకెళ్తుండగా, ఇన్నయ్యకు హైకోర్టు ఇచ్చిన బెయిల్ ఆయనకు తాత్కాలిక న్యాయ ఉపశమనంగా నిలిచింది.



## ఉచిత పథకాలపై తెలంగాణ హైకోర్టు కీలక వ్యాఖ్యలు

**హైదరాబాద్ బ్యూరో:** ఉచిత పథకాలు, ప్రజాధనం వినియోగంపై తెలంగాణ హైకోర్టులో బుధవారం కీలక చర్చ జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కళ్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ పథకాలపై ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. చట్టబద్ధత లేని పథకాలకు ప్రజాధనాన్ని ఖర్చు చేయడం ఎలా అని హైకోర్టు ప్రశ్నించింది. ప్రభుత్వ రంగ సంస్థలను లాభాల్లోకి తీసుకువచ్చి, వాటి ద్వారా వచ్చే ఆదాయాన్ని సంక్షేమ పథకాలకు వినియోగించవచ్చని ధర్మాసనం అభిప్రాయపడింది. అదే సమయంలో భూసేకరణలో న్యాయం జరగక బాధితులు కోర్టుల చుట్టూ తిరుగుతున్నారని హైకోర్టు పేర్కొంది. భూ బాధితుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై గురువారం వివరణ ఇవ్వాలని ఆదేశించింది. తదుపరి విచారణను గురువారానికి వాయిదా వేసింది. ఇదిలా ఉండగా, కళ్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ పథకాలపై ఉన్న స్టేను ఎత్తివేయాలని రాష్ట్ర ప్రభుత్వం తరపు న్యాయవాదులు హైకోర్టును కోరారు. స్టే కొనసాగితే రెండు పథకాల లబ్ధిదారులకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈ రెండు పథకాలపై ఉన్న స్టేను ఎత్తివేయాలా? లేదా కొనసాగించాలా? అనే అంశంపై హైకోర్టు గురువారం నిర్ణయం తీసుకోనుంది.



# 2028లో తెలంగాణలో బీజేపీదే పవర్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** తెలంగాణ రాజకీయాల్లో భారతీయ జనతా పార్టీ దూకుడు పెంచుతోంది. 2028 అసెంబ్లీ ఎన్నికలను లక్ష్యంగా చేసుకుని పార్టీ రాష్ట్రంలో బలమైన రాజకీయ పునాదులు వేసే ప్రయత్నం చేస్తోంది. ఈ క్రమంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో వచ్చే అసెంబ్లీ ఎన్నికల తర్వాత బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలపై పార్టీ నిరంతరం పోరాడుతోందని, అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలను అమలు చేసే దిశగా పనిచేస్తామని తెలిపారు. ఈ వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీశాయి. ముఖ్యంగా 2028 ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని బీజేపీ నేతలు చేస్తున్న ప్రకటనలు పార్టీ భవిష్యత్ కార్యాచరణపై స్పష్టత ఇస్తున్నాయని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. అధికార పక్షానికి ప్రత్యామ్నాయంగా బీజేపీని నిలబెట్టేందుకు రాష్ట్ర నాయకత్వం మరింత దూకుడుగా వ్యవహరిస్తున్నట్లు కనిపిస్తోంది. ప్రజల్లో పార్టీపై నమ్మకం పెంచేందుకు సంక్షేమం, ఉద్యోగాలు, సామాజిక భద్రత వంటి అంశాలను ప్రధానంగా ప్రస్తావిస్తోంది. ఈ ప్రకటనపై తెలంగాణ రాజకీయాల్లో కొత్త చర్చ మొదలైంది. ఇదే సందర్భంలో జర్నలిస్టులకు బండి సంజయ్ ప్రత్యేక హామీ ప్రకటించారు. సమాజానికి సమాచారాన్ని అందించేందుకు రేయింబవళ్లు పనిచేసే జర్నలిస్టులకు సొంత ఇంటి కలను నెరవేర్చే బాధ్యత బీజేపీ ప్రభుత్వం తీసుకుంటుందని చెప్పారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే జర్నలిస్టులందరికీ ఇళ్లు నిర్మించి ఇస్తామని స్పష్టం చేశారు. జర్నలిస్టుల కుటుంబాలకు స్థిరమైన నివాసం కల్పించడం ద్వారా వారి జీవన భద్రతను బలోపేతం చేయాలని భావిస్తున్నట్లు ఆయన మాటల ద్వారా వెల్లడైంది. ఈ హామీ చాలా కాలంగా ఇళ్ల కోసం ఎదురుచూస్తున్న మీడియా వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. జర్నలిస్టుల సంక్షేమానికి సంబంధించిన సమస్యలను ప్రభుత్వం ప్రత్యేకంగా పరిశీలించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయం కూడా ఉంది. ముఖ్యంగా తక్కువ ఆదాయ వర్గాల జర్నలిస్టులకు సొంత ఇల్లు పెద్ద ఆర్థిక భరోసాగా మారవచ్చు. ఈ హామీ అమలుకు స్పష్టమైన విధానం, అర్హత ప్రమాణాలు, నిధుల కేటాయింపు వంటి అంశాలు భవిష్యత్తులో కీలకం కానున్నాయి. ఇళ్ల హామీతో పాటు జర్నలిస్టుల ఆరోగ్య భద్రతపై కూడా బండి సంజయ్ దృష్టి సారించారు. జర్నలిస్టులకు హెల్త్ కార్డులు అందించే చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. అనారోగ్య పరిస్థితుల్లో చికిత్స ఖర్చులు భరించడం చాలామంది మీడియా ఉద్యోగులకు భారంగా మారుతున్న నేపథ్యంలో ఆరోగ్య కార్డు హామీ ప్రాధాన్యం సంతరించుకుంది. ఉద్యోగ భద్రత అంశాన్ని కూడా ఆయన ప్రస్తావించారు. మీడియా రంగంలో పనిచేసే వారికి తగిన ఉద్యోగ భద్రత కల్పించే బాధ్యత తమదేనని భరోసా ఇచ్చారు. ప్రైవేట్ మీడియా సంస్థల్లో పనిచేసే సిబ్బందికి స్థిరత్వం, సంక్షేమ ప్రయోజనాలు, ఆరోగ్య రక్షణ వంటి అంశాలు చాలా కాలంగా చర్చలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడితే జర్నలిస్టుల సంక్షేమానికి ప్రత్యేక విధానం రూపొందిస్తామని చెప్పడం గమనార్హం. అయితే ఉద్యోగ భద్రత అమలు పరిధి, ప్రభుత్వ నియంత్రణ, మీడియా సంస్థల స్వతంత్రత వంటి అంశాలపై స్పష్టమైన విధానం అవసరం. హెల్త్ కార్డుల కోసం ఏ సంస్థలు అర్హత పొందుతాయి, కుటుంబ సభ్యులకు సదుపాయం ఉంటుందా, చికిత్సకు ఎలాంటి ఆసుపత్రులు అందుబాటులో ఉంటాయి వంటి వివరాలు తరువాత వెల్లడికావాల్సి ఉంది. రాష్ట్రంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీ అంశంపైనా బండి సంజయ్ స్పందించారు.



# విద్యార్థులపై పోలీసు దమనకాండను సహించేది లేదు

- మహబూబాబాద్‌లో విద్యార్థులపై క్రూరంగా వ్యవహరించిన పోలీసు అధికారిపై కఠిన చర్యలు తీసుకోవాలి
- 'శక్తి' స్కీమ్, జీవో–97ను వెంటనే రద్దు చేయాలి
- ప్రశ్నిస్తే కేసులు.. నిరసన చేస్తే లాఠీలు ఇదేనా ప్రజాస్వామ్యం?
- విద్యార్థుల గొంతు నొక్కడం కాదు
- సమస్యలను పరిష్కరించడమే ప్రభుత్వ బాధ్యత
- విద్యార్థులపై చేయి పడితే బీఆర్ఎస్ చూస్తూ ఊరుకోదు:
- మాజీ మంత్రి సత్యవతి రాథోడ్




**మహబూబాబాద్ జిల్లా విశాల భారతి:** 'శక్తి' స్కీమ్, జీవో-97ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన చేపట్టిన విద్యార్థులపై పోలీసులు వ్యవహరించిన తీరుపై మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ హక్కుల కోసం శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులపై లాఠీలతో విరుచుకు పడటం, కేసులు నమోదు చేయడం ఏమిటని ఆమె ప్రభుత్వాన్ని నిలదీశారు. విద్యార్థులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రోడ్డెక్కితే వారిపై పోలీసు బలాన్ని ప్రయోగించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని సత్యవతి రాథోడ్ మండిపడ్డారు. ప్రశ్నించే గొంతును అణచివేయడం ద్వారా సమస్యలు పరిష్కారం కావని, విద్యార్థులు, నిరుద్యోగుల ఆవేదనను ప్రభుత్వం అర్థం చేసుకుని వారి డిమాండ్లపై చర్చించాలని సూచించారు. విద్యార్థులపై చేయి వేయడం కాదు.. వారి సమస్యలపై చేయి వేయాలి అని ఆమె స్పష్టం చేశారు. విద్యార్థులపై పోలీసు దమనకాండను తక్షణమే నిలిపివేయాలని, న్యాయమైన డిమాండ్లను పరిష్కరించేందుకు ప్రభుత్వం ముందుకు రావాలని డిమాండ్ చేశారు. మహబూబాబాద్ జిల్లాలో విద్యార్థుల పట్ల క్రూరంగా వ్యవహరించిన పోలీసు అధికారిపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని డీజీపీని సత్యవతి రాథోడ్ కోరారు. బాధ్యులపై చర్యలు తీసుకోకుండా ప్రభుత్వం మౌనం వహిస్తే ప్రజల్లో మరింత ఆగ్రహం వ్యక్తమయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు. విద్యార్థులపై చేయి పడితే బీఆర్ఎస్ చూస్తూ ఊరుకోదు అని సత్యవతి రాథోడ్ స్పష్టం చేశారు. విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం బీఆర్ఎస్ అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కు, నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందని, ఆ హక్కులను ప్రభుత్వం గౌరవించాల్సిందేనని అన్నారు. విద్యార్థుల గొంతు నొక్కడం ప్రభుత్వ బాధ్యత కాదని, వారి సమస్యలకు పరిష్కారం చూపడమే ప్రభుత్వ అసలు బాధ్యత అని సత్యవతి రాథోడ్ పేర్కొన్నారు. తక్షణమే పోలీసు అధికారిపై చర్యలు తీసుకుని, విద్యార్థుల డిమాండ్లను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## కాంగ్రెస్‌లో మరోసారి భగ్గుమన్న విభేదాలు

**పోచారంపై బాన్సువాడ కాంగ్రెస్ నేతల తిరుగుబాటు.. సస్పెండ్ చేయాలంటూ ధర్నా**



**నిజామాబాద్ జిల్లా విశాల భారతి:** కాంగ్రెస్‌లో విభేదాలు మరోసారి భగ్గుమన్నాయి. ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డిపై సొంత పార్టీ నేతలు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వంపై పోచారం చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని, పార్టీకి నష్టం కలిగించేలా వ్యవహరిస్తున్న ఆయనను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి వర్గానికి చెందిన బాన్సువాడ కాంగ్రెస్ నాయకులు బుధవారం నిజామాబాద్‌లో ఆందోళనకు దిగారు. కాంగ్రెస్ సమీక్షా సమావేశం జరుగుతున్న గార్డెన్ ఎదుటే బైఠాయించి పోచారానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క సమీక్షా సమావేశానికి హాజరైన సమయంలోనే ఈ నిరసన చేపట్టడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. 'పోచారం మాకొద్దు.. వెంటనే సస్పెండ్ చేయాలి' అంటూ నాయకులు నినదించారు. పార్టీ పెద్దల సమక్షంలోనే సొంత పార్టీ ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా నిరసన చేపట్టడంతో బాన్సువాడ కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలు మరోసారి బహిర్గతమయ్యాయి. బీఆర్ఎస్ బీఫాంతో ఎమ్మెల్యేగా గెలిచిన పోచారం శ్రీనివాస్‌రెడ్డి అనంతరం కాంగ్రెస్‌లో చేరారు. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి, ప్రభుత్వ పనితీరుపై ఆయన చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి. నియోజకవర్గంలో అభివృద్ధి పనులు జరగడం లేదని, నిధులు విడుదల కావడం లేదని పోచారం చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ నేతలు తప్పుబట్టారు. ప్రభుత్వంపై, పార్టీ నాయకత్వంపై బహిరంగంగా విమర్శలు చేయడం వల్ల కాంగ్రెస్‌కు నష్టం జరుగుతోందని ఆరోపించారు. బాన్సువాడలో పార్టీ కోసం ఏళ్లుగా పనిచేస్తున్న సీనియర్ నాయకులను విస్మరిస్తున్నారని ఆందోళనకారులు ఆరోపించారు. పోచారం వ్యవహారశైలి కారణంగా పార్టీకి నష్టం జరుగుతోందని, కష్టపడి పనిచేస్తున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల్లో అసంతృప్తి పెరుగుతోందని పేర్కొన్నారు. పార్టీ బలోపేతానికి పనిచేస్తున్న సీనియర్లకు ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పోచారం శ్రీనివాస్‌రెడ్డి తన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. పార్టీకి నష్టం కలిగించే విధంగా వ్యవహరిస్తున్న ఆయనపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని, అవసరమైతే పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని కోరారు.

## 'విశాలభారతి' ఎఫెక్ట్: అంగన్‌వాడీ కేంద్రానికి కదిలిన విద్యుత్ అధికారులు

- పత్రికా వార్తకు తక్షణమే స్పందించిన విద్యుత్ శాఖ అధికారులు
- 20 ఏళ్ల చీకటిని తొలగిస్తూ విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు చర్యలు
- హర్షం వ్యక్తం చేస్తున్న చిన్నారుల తల్లిదండ్రులు, గ్రామ ప్రజలు



**మునగాల (విశాలభారతి):** మండలంలోని తాడ్వాయి గ్రామ అంగన్‌వాడీ కేంద్రానికి గత 20 సంవత్సరాలుగా విద్యుత్ సౌకర్యం లేక చిన్నారులు, గర్భిణీలు పడుతున్న ఇబ్బందులపై 'విశాలభారతి' దినపత్రికలో ప్రచురితమైన ప్రత్యేక కథనానికి విద్యుత్ శాఖ అధికారులు తక్షణమే స్పందించారు. "20 ఏళ్లుగా అంగన్‌వాడీ కేంద్రానికి విద్యుత్ కరువు!" అనే శీర్షికతో వచ్చిన వార్త క్షేత్రస్థాయిలో అధికారులను కదిలించింది.సమస్య తీవ్రతను గుర్తించిన విద్యుత్ అధికారులు తక్షణమే స్పందించి, అంగన్‌వాడీ కేంద్రానికి విద్యుత్ కనెక్షన్ ఇచ్చేందుకు అవసరమైన చర్యలు చేపట్టారు. రెండు దశాబ్దాలుగా ఎవరూ పట్టించుకోని ఈ సమస్యను పత్రికా ముఖంగా వెలుగులోకి తెచ్చి, అధికారుల దృష్టికి తీసుకెళ్లడం పట్ల గ్రామ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వార్త ప్రచురితమైన వెంటనే సానుకూలంగా స్పందించి సమస్య పరిష్కారానికి పూనుకున్న విద్యుత్ శాఖ అధికారులకు, అలాగే అండగా నిలిచిన 'విశాలభారతి' పత్రిక యాజమాన్యానికి గ్రామస్థులు, చిన్నారుల తల్లిదండ్రులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఆశ్రమపాఠశాల వసతులను పరిశీలించిన ఉపసర్పంచ్ గుండె వెంకన్న

**బూర్గంపహాడ్ /విశాల భారతి :** బూర్గంపహాడ్ స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను ఉపసర్పంచ్ గుండె వెంకన్న ఆకస్మిక తనిఖీ చేసి విద్యార్థుల వసతులను, మధ్యాహ్న భోజన నాణ్యతను, వంటగది పరిసరాల పరిశుభ్రతను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి కూర్చొని భోజనం రుచి చూశారు. ఈ సందర్భంగా ఉపసర్పంచ్ గుండె వెంకన్న మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థుల ఆరోగ్యం, చదువుపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందని, దానికి అనుగుణంగా పాఠశాలల్లో నాణ్యమైన ఆహారాన్ని అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. విద్యార్థులకు ప్రతిరోజూ మెనూ ప్రకారం రుచికరమైన, పరిశుభ్రమైన మరియు పౌష్టికాహారాన్ని మాత్రమే వడ్డించాలని ప్రధానోపాధ్యాయులకు వంట సిబ్బందికి ప్రత్యేకమైన సూచనలు చేశారు. భోజనం తయారీలో ఎలాంటి అలసత్వం వహించినా సహించేది లేదని అన్నారు. అనంతరం ఆయన విద్యార్థులతో నేరుగా ముచ్చటించి పాఠశాలలో అందుతున్న సౌకర్యాలు, మంచినీటి వసతి, పాఠ్యపుస్తకాలు, యూనిఫాన్స్ మరియు హాస్టల్ వసతులపై విద్యార్థుల నుండి సమాచారం తెలుసుకున్నారు. విద్యార్థులకు ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే తమ దృష్టికి గానీ, ఉపాధ్యాయుల దృష్టికి గానీ తీసుకురావాలని సూచించారు. పాఠశాల సమస్యలను స్థానిక ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే పరిష్కరిస్తామని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.






## ఎస్ఐఆర్ ప్రక్రియ పకడ్బందీగా పూర్తి చేయాలి

- మ్యాపింగ్ కాని, అనామలీస్ ఓటర్లకు నోటీసులు.
- క్లెయిమ్స్, అభ్యంతరాలను గడువులోగా పరిష్కరించాలి
- అర్హులైన ప్రతి ఓటరు హక్కును కాపాడాలి: సీఈఓ సుదర్శన్‌రెడ్డి

**మహబూబాబాద్ జిల్లా విశాల భారతి:** ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియను పకడ్బందీగా, పారదర్శకంగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఎస్ఐఆర్ ప్రక్రియపై సమీక్షించారు. మహబూబాబాద్ ఐడీఓసీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి స్నేహ శబరిష్ సమావేశంలో పాల్గొన్నారు. ఆగస్టు 17న విడుదలైన డ్రాఫ్ట్ ఓటరు జాబితాపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో అన్ని స్థాయిల్లో సమావేశాలు నిర్వహించాలని సుదర్శన్‌రెడ్డి సూచించారు. డ్రాఫ్ట్ ఓటరు జాబితా వివరాలను వారికి వివరించి, వారి నుంచి వచ్చే క్లెయిమ్స్, అభ్యంతరాలను నిబంధనల ప్రకారం స్వీకరించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల వారీగా గుర్తించిన మ్యాపింగ్ కాని ఓటర్లు, అనామలీస్ కేసులను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. సంబంధిత ఓటర్లకు నిబంధనల ప్రకారం నోటీసులు జారీ చేసే ప్రక్రియను ప్రారంభించాలని, నోటీసులు అందుకున్న వారికి తమ వివరణ, అవసరమైన పత్రాలను సమర్పించేందుకు అవకాశం కల్పించాలని తెలిపారు. అనంతరం అందిన వివరణలు, పత్రాలను నిబంధనల మేరకు పరిశీలించి తదుపరి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. డ్రాఫ్ట్ ఓటరు జాబితాపై వచ్చే ప్రతి క్లెయిమ్, అభ్యంతరాన్ని నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సీఈఓ స్పష్టం చేశారు. అర్హత కలిగిన ప్రతి ఓటరు ఓటు హక్కును పరిరక్షించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ఎస్ఐఆర్ ప్రక్రియలో ఎలాంటి లోపాలకు తావులేకుండా ప్రతి దశను క్షుణ్ణంగా పర్యవేక్షించాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ మాట్లాడుతూ జిల్లాలో మ్యాపింగ్ కాని ఓటర్లు, అనామలీస్ గుర్తించిన వారికి నోటీసులు జారీ చేసేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. డ్రాఫ్ట్ ఓటరు జాబితాపై అందే ప్రతి క్లెయిమ్, అభ్యంతరాన్ని నిర్ణీత గడువులోగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అర్హత కలిగిన ఏ ఒక్క ఓటరు కూడా ఓటు హక్కును కోల్పోకుండా జిల్లాలో అన్ని విధాలుగా చర్యలు చేపడుతున్నామని కలెక్టర్ తెలిపారు. సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని వివరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె. అనిల్‌కుమార్, తొర్రూరు ఆర్డీవో గణేష్, ఎలక్షన్ సూపరింటెండెంట్ పవన్‌కుమార్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నితీష్‌కుమార్, మహబూబాబాద్ తహసీల్దార్ రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## జుజురు తండా పాఠశాలకు అధికారికంగా పేరు మార్పు

- సోమ్లా తండా పేరు తొలగింపు.. జుజురు తండాగా అధికారిక నామకరణం
- అధికారుల విచారణ అనంతరం పాఠశాల విద్యాశాఖ నిర్ణయం
- గ్రామస్థుల చిరకాల కోరిక నెరవేరింది: డా. వీరన్న నాయక్

**కురవి విశాల భారతి:** మహబూబాబాద్ జిల్లా కురవి మండలం జుజురు తండా గ్రామపంచాయతీ పరిధిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు అధికారికంగా పేరు మారింది. ఇప్పటివరకు ఎంపీపీఎస్ సోమ్లా తండాగా కొనసాగుతున్న పాఠశాలను ఇకపై ఎంపీపీఎస్ జుజురు తండాగా మార్చుతూ తెలంగాణ పాఠశాల విద్యాశాఖ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. దీంతో జుజురు తండా గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తూ సంబరాలు నిర్వహించారు. జుజురు తండాలో పాఠశాల భవన నిర్మాణం కోసం దివంగత నాయకుడు, మోదుగుల గూడెం ఉమ్మడి గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ శ్రీ గోపా నాయక్ తనకు చెందిన నాలుగు గుంటల భూమిని పాఠశాల నిర్మాణానికి విరాళంగా అందించారు. అనంతరం అదే స్థలంలో ప్రభుత్వ పాఠశాల భవనం నిర్మించారు. ఈ నేపథ్యంలో పాఠశాలకు తమ గ్రామం పేరైన జుజురు తండాను పెట్టాలని గ్రామ పెద్దలు, ప్రజలు, గోపా నాయక్ కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు. గ్రామసభ నిర్వహించి తీర్మానం చేయడంతో పాటు ఆధార్, రేషన్, ఓటరు గుర్తింపు కార్డులు, అంగన్‌వాడీ కేంద్రం పేరు, ఇతర ప్రభుత్వ రికార్డుల్లోనూ గ్రామం పేరు జుజురు తండాగానే ఉందని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కురవి మండల విద్యాశాఖ అధికారి, తహసీల్దార్, మహబూబాబాద్ జిల్లా విద్యాశాఖ అధికారి తదితర అధికారులు విచారణ చేపట్టి గ్రామస్థులు సమర్పించిన ఆధారాలు, ప్రభుత్వ రికార్డులు, గ్రామసభ తీర్మానాన్ని పరిశీలించారు. అనంతరం పాఠశాల పేరును మార్చేందుకు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో తెలంగాణ పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ కార్యాలయం నుంచి ఎంపీపీఎస్ సోమ్లా తండా పేరును ఎంపీపీఎస్ జుజురు తండాగా మార్చుతూ అధికారిక నిర్ణయం వెలువడింది.




**"జుజురు తండా ప్రజల చిరకాల కోరిక నెరవేరింది".**

టీపీసీసీ డాక్టర్ విభాగం నాయకులు డా. వీరన్న నాయక్ మాట్లాడుతూ, "జుజురు తండా పాఠశాలకు అధికారికంగా అదే గ్రామం పేరు రావడం ఎంతో సంతోషకరమైన విషయం. గ్రామ ప్రజలు ఎన్నో రోజులుగా కోరుతున్న న్యాయమైన డిమాండ్ నేడు నెరవేరింది. పాఠశాల నిర్మాణం కోసం తన విలువైన భూమిని విరాళంగా అందించిన దివంగత గోపా నాయక్ సేవలను గ్రామ ప్రజలు ఎప్పటికీ మరిచిపోరు. గ్రామస్థులు సమర్పించిన ఆధారాలు, ప్రభుత్వ రికార్డులను అధికారులు పరిశీలించి వాస్తవాలను గుర్తించి పాఠశాల పేరును మార్చడం అభినందనీయం" అని అన్నారు. "ప్రజల ఆకాంక్ష, గ్రామ చరిత్ర, ప్రభుత్వ రికార్డులకు అనుగుణంగా జుజురు తండా పేరు పాఠశాలకు అధికారికంగా రావడం ప్రతి గ్రామస్థుడి విజయంగా భావిస్తున్నాం. చివరకు నిజం గెలిచింది" అని డా. వీరన్న నాయక్ పేర్కొన్నారు. గ్రామ సర్పంచ్ మధు శిరీష, ఉపసర్పంచ్ శరత్ కుమార్, గ్రామ పెద్ద బానోత్ శ్రీరామ్ మాట్లాడుతూ పాఠశాలకు జుజురు తండా పేరు రావడం గ్రామ ప్రజల చిరకాల కోరిక నెరవేరినట్లేనని అన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు దారావత్ నరేష్, మాజీ అధ్యక్షుడు బానోత్ రవి, వార్డు సభ్యులు బానోతు మంగి లచ్చిరామ్, బానోతు సురేష్, దారావత్ ఇస్త్రారి తిరుపతి, పులసింగ్, దారావత్ వెంకటేష్, శంకర్, నాను, రాములు, దారావత్ మోతిలాల్, దారావత్ మాన్సింగ్, బానోత్ జేత్య, దస్రు వెంకన్న, ఘన్యా, దారావత్ బిచ్య, బానోత్ దేవు, దారావత్ శ్రీరామ్, చిరంజీవి తదితర గ్రామ పెద్దలు, నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఫోటోగ్రాఫర్లకు సన్మానం



**ఆర్మూర్, విశాల భారతి:** లయన్స్ క్లబ్ ఆఫ్ నందిపేట్ ఆధ్వర్యంలో ఈ అంతర్జాతీయ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా నందిపేట్ మండలంలోని ఫోటో గ్రాఫర్ లను బుధవారం సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. వారి ఫోటోగ్రఫీతో మండలంలో అందమైన ఫోటోలను షేర్ చేసి భావితరాలకు గుర్తింపు ఉండే విధంగా అందరికీ సేవలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు మంద మహిపాల్, సెక్రటరీ గంగుల గంగాధర్, ట్రెజరర్ దేవుడు నరేష్, గంగుల జనార్దన్, లోకం నర్సయ్య, అవదూత నర్సయ్య పోటోగ్రాపర్లు పాల్గొన్నారు.

## మహబూబాబాద్‌లో ముత్యాలమ్మ తల్లికి ఘనంగా బోనాలు

**భక్తిశ్రద్ధలతో బోనం సమర్పించిన శివశక్తి సురేఖ దేవి**



**మహబూబాబాద్ జిల్లా విశాల భారతి:** మహబూబాబాద్ జిల్లాలో ముత్యాలమ్మ తల్లి బోనాల ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులు బోనాలు సమర్పిస్తూ తమ మొక్కులు చెల్లించుకున్నారు. దీంతో ఆలయ పరిసరాలు భక్తుల రద్దీతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకున్నాయి. ఈ సందర్భంగా శివశక్తి సురేఖ దేవి (ప్రవీన్ స్వామి) ముత్యాలమ్మ తల్లికి సంప్రదాయబద్ధంగా బోనం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆమె ఆకాంక్షించారు. బోనాల సందర్భంగా మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి బోనాలు సమర్పించడంతో ఉత్సవం వైభవంగా సాగింది. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల జయజయధ్వానాలతో ముత్యాలమ్మ ఆలయ పరిసరాలు మార్మోగాయి. ఈ కార్యక్రమంలో శ్రీను స్వామి, రాంబాబు, నవ్య, నేత్ర, శారదా, తదితరులు పాల్గొన్నారు.

## శక్తి పరిధి నుంచి పాలిటెక్నిక్ విద్యను తొలగించాలి

**పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు పుల్లూరి సింహాద్రి**



**సూర్యాపేట, (విశాలభారతి)కలెక్టరేట్:** పాలిటెక్నిక్ విద్యను శక్తి పరిధిలోకి ఏకపక్షంగా విలీనం చేయాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు పుల్లూరి సింహాద్రి డిమాండ్ చేశారు. పాలిటెక్నిక్ విద్యను ఎప్పటిలాగే ఎస్బీటెట్ పరిధిలోనే కొనసాగించాలని కోరుతూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి సూర్యాపేట జిల్లా జాయింట్ కలెక్టర్ హరిసింగ్‌కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా సింహాద్రి మాట్లాడుతూ.. డిప్లొమా అనంతరం ఉన్నత విద్య, లేటరల్ ఎంట్రీలపై స్పష్టమైన హామీ ఇవ్వకుండా విలీనం చేయడం విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడటమేనన్నారు. స్కిల్ యూనివర్సిటీ పరిధిలోకి పాలిటెక్నిక్‌ను తీసుకెళ్తే ఫీజుల భారం పెరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ విద్యను కార్పొరేటీకరణ చేయడాన్ని వ్యతిరేకిస్తున్నామని, ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినులు స్నేహ, రిషిత, నవీన, జానకి, అమృత వర్షిని, గాయత్రి, లహరి, శృతి, శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

## దేవాదుల నీళ్ల కోసం బీఆర్ఎస్ పాదయాత్ర



**జనగామ జిల్లా విశాల భారతి:** దేవాదుల ప్రాజెక్టు నుంచి రైతులకు సాగునీరు అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే విఫలమయ్యారని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు పల్లా సుందర్ రాంరెడ్డి ఆరోపించారు. రైతుల సమస్యలపై ప్రభుత్వానికి కళ్లు తెరిపించేందుకే మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆధ్వర్యంలో పాదయాత్ర చేపడుతున్నట్లు తెలిపారు. దేవరుప్పుల మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో మండల అధ్యక్షుడు తీగల దయాకర్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. దివంగత మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహం తొలగింపును నిరసిస్తూ నర్సంపేటలో నిర్వహించనున్న కార్యక్రమానికి వెళ్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును జనగామ పోలీసులు అరెస్టు చేయడాన్ని ఖండించారు. గురువారం ఉదయం 8 గంటలకు మరిపడిగ స్టేజి నుంచి బంజర స్టేజి వరకు ఎన్2 కాలువ వెంబడి సుమారు 6 కిలోమీటర్ల మేర ఎర్రబెల్లి దయాకర్‌రావు పాదయాత్ర చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ పాదయాత్రలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, యువజన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కేజీబీవీ పాఠశాలలో విద్యార్థినులకు చట్టాలపై అవగాహన



**మోతె , ఆగస్టు 19 విశాల భారతి :** మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ గురుకుల బాలికల విద్యాలయ (KGBV) లో బుధవారం పోలీసుల ఆధ్వర్యంలో విద్యార్థినులకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ ఇన్‌స్పెక్టర్ (SI)లచ్చి రెడ్డి మాట్లాడుతూ విద్యార్థినులు చదువుతో పాటు సామాజిక అంశాలపై, చట్టాలపై కనీస అవగాహన కలిగి ఉండాలని సూచిచారు .

**మాదకద్రవ్యాల నిర్మూలన (AntiDrug):** డ్రగ్స్, గంజాయి వంటి వ్యసనాలకు యువత దూరంగా ఉండాలని, వాటి వల్ల జరిగే నష్టాలను వివరించారు.

**సైబర్ భద్రత (Cyber Security):** సోషల్ మీడియా వాడకంలో జాగ్రత్తలు వహించాలని, సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా ఉండాలని సూచించారు.

**రోడ్డు భద్రత (Road Safety):** ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, మైనర్లు వాహనాలు నడపరాదని స్పష్టం చేశారు.

**పోలీస్ అక్క (Police Akka)** & మహిళా రక్షణ విద్యార్థినులకు ఏ సమస్య వచ్చినా ధైర్యంగా 'పోలీస్ అక్క 'ను సంప్రదించవచ్చని, మహిళలు, పిల్లల రక్షణకు పోలీసులు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటారని భరోసా ఇచ్చారు.

**డైల్ 112 (Dial 112):** ఆపద సమయంలో తక్షణ సహాయం కోసం అత్యవసర హెల్ప్‌లైన్ నంబర్ 112ను ఎలా ఉపయోగించుకోవాలో ప్రాక్టికల్‌గా వివరించారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ క్రాంతి కుమారి, ఏ యన్ యం మల్లీశ్వరి అధ్యాపక బృందం శ్రీదేవి విద్యార్థినులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకలు



**తిరుమలగిరి, విశాల భారతి :** 187 వ ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేదికలను తిరుమలగిరి మున్సిపాలిటీ కేంద్రంలో ఫోటో అండ్ వీడియో గ్రాఫర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కెమెరా సృష్టికర్త లూయిస్ మండే డాగ్యూరె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మండల అధ్యక్షులు సుంకరి సుధీర్ ఫోటోగ్రఫీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పట్టణ కేంద్రంలో బైక్ ర్యాలీ నిర్వహించారు.స్థానిక ఎస్సై ను శాలువాతో సన్మానించారు. ఫోటోగ్రాఫర్ల సమస్యలపై సమావేశం నిర్వహించి మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా ధరలను నిర్ణయించి యూనియన్ సభ్యులు పాటించాలని చర్చించారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు మున్సిపల్ చైర్మన్ సంకేపల్లి రఘునందన్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు సీనియర్ ఫోటోగ్రాఫర్ వంగూరి యాదగిరి, జిల్లా కోశాధికారి బండారు లాలు ,ఉపాధ్యక్షుడు పరశురాములు,ప్రధాన కార్యదర్శి దామెర రమేష్,కోశాధికారి సన్నీ , వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్ము భాస్కర్,కార్యదర్శి మహేష్, కుటుంబ భరోసా ఇంచార్జి బోండ్ల అర్జున్, సీనియర్ ఫోటో గ్రాఫర్లు శ్రీరాములు,నారాయణ,మల్లేష్,కిష్టు నాయక్, గంగాధర్మ, బాబేష్,రమేష్,తదితరులు పాల్గొన్నారు.

## తిరుమల శ్రీవారి సన్నిధిలో జనగామ జిల్లా యువజన నాయకులు

**బబ్బూరి శ్రీకాంత్ గౌడ్ దంపతులు**



**జనగాం విశాల భారతి :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన తిరుమల శ్రీవారి ఆలయంలో బుధవారం ఉదయం వీఐపీ బ్రేక్ దర్శన సమయంలో బీఆర్ఎస్ జనగామ జిల్లా నాయకులు బబ్బూరి శ్రీకాంత్ గౌడ్ దంపతులు జనగామ జిల్లాలో వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని రైతుల ఇళ్లల్లో సుఖ సంతోషాలు కలగాలని కోరుకుంటూ శ్రీవారిని దర్శించుకున్నారు. దర్శనానంతరం ఆలయ పండితులు వారికి వేద ఆశీర్వచనాలు అందించి, శ్రీవారి తీర్థప్రసాదాలను అందజేశారు. శ్రీవారి దర్శనం సంతోషాన్ని కలిగించిందని బబ్బూరి శ్రీకాంత్ గౌడ్ దంపతులు తెలిపారు.

## నవరాత్రి ఉత్సవాలకి మండపాలు ఏర్పాటు చేయాలని విన్నపం

**సర్పంచ్ మరియు ఉప సర్పంచ్ గారికి..**



**దేవరప్పుల విశాల భారతి :** వినాయక చవితి మరియు దేవి నవరాత్రి ఉత్సవాల మండపాల ఏర్పాటుకు స్థలం కేటాయించ వలసిందిగా మనవి పత్రం ద్వారా విన్నపం చేసుకున్నారు.మా గ్రామ ప్రజలందరి తరపున మనవి చేయునది ఏమనగా, త్వరలో జరగనున్న వినాయక చవితి మరియు దేవి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని గ్రామంలో వినాయక మండపం, దుర్గామాత మండపాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించాము. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ ఆవరణలోని "100 రోజుల పని" శిలాఫలకం పక్కన ఉన్న ఖాళీ స్థలాన్ని మండపాల ఏర్పాటుకు కేటాయించాల్సిందిగా కోరుతున్నాము. భక్తుల దర్శనానికి, పండుగ కార్యక్రమాల నిర్వహణకు ఈ స్థలం అనుకూలంగా ఉంటుంది.కావున, మా విన్నపాన్ని సానుకూలంగా పరిశీలించి, సదరు స్థలంలో మండపాలను ఏర్పాటు చేసుకునేందుకు అనుమతి మంజూరు చేయవలసిందిగా గౌరవపూర్వకంగా చత్రపతి శివాజీ కమిటీ సభ్యులు కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొండ ఊర్మిల మల్లారెడ్డి ఉప సర్పంచ్ జోగు అనిల్ గ్రామ కార్యదర్శి నజియా,వార్డు సభ్యులు మేడ రాజు, కొండ అఖిల్ రెడ్డి, మేకపోతుల నరసింహ, రాపాక యాదగిరి, పాలడుగు నవనీత ప్రవీణ్, తాళ్లపల్లి వేణు, కొంగరి జ్యోతి రాములు, అన్నారపు అలివేలు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ఇంచార్జి మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన కలెక్టర్



**నిజామాబాద్ జిల్లా విశాల భారతి :** నిజామాబాద్, ఆగస్టు 19 : నిజామాబాద్ నగర పర్యటనకు విచ్చేసిన జిల్లా ఇంచార్జి మంత్రి డి.అనసూయ సీతక్కను కలెక్టర్ భవేష్ మిశ్రా బుధవారం రోడ్లు భవనాల శాఖ అతిథి గృహం వద్ద మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రితో పాటు ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీలకు పూల మొక్కలు అందించి స్వాగతం పలికారు. వారితో కొద్దిసేపు భేటీ అయ్యి పలు అంశాలపై చర్చించారు. కలెక్టర్ వెంట నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్ తదితరులు ఉన్నారు.

## ప్రమాదానికి గురైన గొల్లపూడి అశోక్ కుటుంబానికి రూ. 1,76,500 ల ఆర్థిక సాయం



**మునగాల, విశాల భారతి:** మండల పరిధిలోని నరసింహుల గూడెం గ్రామానికి చెందిన డ్రైవర్ గొల్లపూడి అశోక్ ఇటీవల జరిగిన ఒక దురదృష్టవశాత్తు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, అంగ వికలాంగుడిగా మారిన విషయం విదితమే. కుటుంబ పెద్ద ఆసుపత్రి పాలై, పని చేయలేని స్థితిలో ఉండటంతో ఆ కుటుంబం తీవ్ర ఇబ్బందుల్లో పడింది. ఈ విషాద సమయంలో అశోక్ కు తోటి డ్రైవర్లు గొప్ప మానవత్వాన్ని చాటుకున్నారు. నరసింహుల గూడెంకు చెందిన డ్రైవర్లందరూ ఏకమై, బాధిత అశోక్ కుటుంబానికి అండగా నిలవాలని నిర్ణయించుకున్నారు. అందరూ కలిసి తమ వంతుగా విరాళాలు సేకరించి, మొత్తం రూ. 1,76,500 ల భారీ ఆర్థిక సాయాన్ని ఈరోజు అశోక్ కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సహాయంలో డ్రైవర్లు కేవలం నగదు ఇవ్వడమే కాకుండా గొప్ప ముందుచూపును కూడా ప్రదర్శించారు. అశోక్ పిల్లల చదువులు, ఉజ్వల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఈ మొత్తం నుంచి రూ. 1,50,000 లను పిల్లల పేరిట బ్యాంకులో ఫిక్స్డ్ డిపాజిట్ (Fixed Deposit) చేయడం జరిగింది. మిగిలిన నగదును వారి తక్షణ వైద్య, కుటుంబ అవసరాల నిమిత్తం అందజేశారు. ఆపత్కాలంలో తోటి కార్మికుడికి అండగా నిలిచిన నరసింహుల గూడెం డ్రైవర్ల దాతృత్వాన్ని, సంఘీభావాన్ని గ్రామస్తులు, స్థానికులు తీవ్రంగా అభినందిస్తున్నారు. కష్టకాలంలో వారు చూపించిన ఈ ఔదార్యం అందరికీ ఆదర్శప్రాయం. ఈ కార్యక్రమంలో తమ తోటి డైవర్ లో తదితరులు పాల్గొన్నారు

## ఉత్తమ సేవలకు గుర్తింపు.. ఇచ్చోడ తహసీల్దార్‌కు ఘన సన్మానం"

- బద్దం రామచంద్ర రెడ్డి ఆధ్వర్యంలో శాలువాతో సన్మానం
- అభినందనలు తెలిపిన అడేగామా (కె) ప్రజాప్రతినిధులు

**ఆదిలాబాద్ జిల్లా విశాలభారతి :** ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ ఉత్తమ సేవలకు ప్రశంసాపత్రం అందుకున్న ఇచ్చోడ తహసీల్దార్‌కు బుధవారం ఘన సత్కారం జరిగింది. ఆదిలాబాద్ జిల్లా ఉప సర్పంచ్ సంఘం అధ్యక్షుడు, అడేగామా (కె) గ్రామ ఉప సర్పంచ్ బద్దం రామచంద్ర రెడ్డి ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు శాలువా కప్పి సన్మానించి అభినందనలు తెలిపారు.ప్రభుత్వ పథకాలు, సేవలను ప్రజలకు సమర్థవంతంగా చేరవేస్తూ ఉత్తమ అధికారిగా గుర్తింపు పొందడం అభినందనీయమని బద్దం రామచంద్ర రెడ్డి పేర్కొన్నారు. ప్రజా సేవలో ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ మరింత పేరు ప్రతిష్ఠలు పొందాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా తహసీల్దార్‌కు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అడేగామా (కె) గ్రామ వార్డు సభ్యులతో పాటు ఆశన్న, లక్ష్మణ్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



# ఫిలిప్పీన్స్ దేశ మైగ్రేషన్ పాలసీ స్టడీ టూర్‌లో తెలంగాణ రాష్ట్ర ఎన్నారై అడ్వయిజరీ కమిటీ బృందం

- పర్యటనలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యే డాక్టర్ ఆర్. భూపతి రెడ్డి
- గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం నివేదిక రూపకల్పనకు కృషి
- ప్రపంచంలో ఫిలిప్పీన్స్ దేశంలోనే ఉత్తమ మైగ్రేషన్ విధానం ఉంది
- ఫిలిప్పీన్స్ మైగ్రేషన్ తీరులోనే తెలంగాణ రాష్ట్ర వలస విధానంపై ప్రణాళికలు రచిస్తాం
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యే డాక్టర్ ఆర్. భూపతి రెడ్డి వెల్లడి

**నిజామాబాద్ జిల్లా విశాల భారతి**



ప్రపంచంలోనే ఉత్తమ మైగ్రేషన్ పాలసీ (వలస విధానం) అమలులో ఉన్న ఫిలిప్పీన్స్ దేశంలో తెలంగాణ రాష్ట్ర ఎన్నారై అడ్వైజరీ కమిటీ బృందం మూడు రోజుల పర్యటనలో భాగంగా మంగళవారం ఆ దేశ రాజధాని మనీలాలో జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో పాల్గొంది. తెలంగాణ రాష్ట్రం నుంచి గల్ఫ్ దేశాల్లో ఉపాధి కోసం వలస వెళ్లిన సుమారు 15 లక్షల మంది కార్మికుల సంక్షేమం కోసం అనుసరించాల్సిన విధానాలపై రాష్ట్ర ప్రభుత్వం రూపొందించనున్న కార్యాచరణ ప్రణాళికను రచించేందుకు రాష్ట్ర ఎన్నారై అడ్వైజరీ కమిటీ ఫిలిప్పిన్ దేశ పర్యటన అనుభవాలతో తయారు చేసే నివేదిక ఎంతో ఉపయోగపడనుంది. ఫిలిప్పీన్స్ దేశ రాజధాని మనీలా నగరంలోని ఇబీస్ స్టయిల్స్ అరెనేట కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన ఉన్నత స్థాయి సమావేశంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్,నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్ భూపతిరెడ్డి మాట్లాడుతూ.. గల్ఫ్ లో నివాసముంటున్న కార్మికుల కోసం సంక్షేమం కోసం ఉత్తమమైన సంక్షేమ విధానాన్ని అమలు చేసేందుకు కృషి చేస్తున్నట్లు, అందులో భాగంగానే ఫిలిప్పీన్స్ దేశ పర్యటనకు వచ్చినట్లు తెలిపారు. గల్ఫ్ కార్మికుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని, అందుకోసం ఉత్తమమైన గల్ఫ్ సంక్షేమ పాలసీని రూపొందించడం కోసం కృషి చేస్తున్నట్లు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యే భూపతిరెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ గల్ఫ్ ఎన్నారై పాలసీ రూపకల్పన, 'గల్ఫ్ అండ్ అదర్ ఓవర్సీస్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డు' ఏర్పాటు చేయాలనే ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా ఈ పర్యటన చేపట్టినట్లు వారు తెలిపారు. ఈ కాన్ఫరెన్స్‌లో ఫిలిప్పీన్స్ లేబర్ మైగ్రేషన్ అండ్ సివిల్ సొసైటీస్ ఆర్గనైజేషన్ రెస్పాన్స్, ఫిలిప్పీన్స్ లేబర్ మైగ్రేషన్ గవర్నెన్స్, బిల్డింగ్ అండ్ వుడ్ వర్కర్స్ ఇంటర్నేషనల్ ట్రేడ్ యూనియన్, గ్లోబల్ మైగ్రేషన్ యాక్షన్ ప్లాన్, లేబర్ మైగ్రేషన్ కారిడార్ ఆర్గనైజేషన్ ఎక్స్పీరియన్సెస్ అనే అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ కాన్ఫరెన్స్‌లో తెలంగాణ రాష్ట్ర ఎన్నారై అడ్వైజరి కమిటీ చైర్మన్ అంబసడర్ డాక్టర్ బి.ఎం. వినోద్ కుమార్, వైస్ చైర్మన్ మంద భీంరెడ్డి సభ్యులు సింగిరెడ్డి నరేష్ రెడ్డి, నంగి దేవేందర్, స్వదేశ్ పరికిపండ్ల, ప్రొఫెసర్లు విజయ్ కొర్ర, జునుగూరు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## అమరవీరుడు పండగ సాయన్న ముదిరాజ్‌కు అధికారిక గుర్తింపు

- జయంతి, వర్ధంతిని ఏటా అధికారికంగా నిర్వహించాలి
- తెలంగాణ ప్రభుత్వ నిర్ణయంపై ముదిరాజ్ ఉద్యోగులు, ప్రజల హర్షం
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపిన పొన్నెబోయిన వెంకన్న

**మహబూబాబాద్ జిల్లా విశాల భారతి):**



తెలంగాణ వీరుడు, అమరవీరుడు పండగ సాయన్న ముదిరాజ్‌కు రాష్ట్ర ప్రభుత్వం అధికారిక గుర్తింపు కల్పించడం పట్ల ముదిరాజ్ సమాజం హర్షం వ్యక్తం చేసింది. పండగ సాయన్న ముదిరాజ్ జయంతిని అక్టోబర్ 22న, వర్ధంతిని డిసెంబర్ 10న ప్రతి ఏటా అధికారికంగా నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు 18.08.2026న ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి క్రీడలు, మత్స్యశాఖ మంత్రి వాకిటి శ్రీహరి అధికారిక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ముదిరాజ్ ఎంప్లాయిస్ ప్రొఫెషనల్ అసోసియేషన్ మండల అధ్యక్షులు పొన్నెబోయిన వెంకన్న మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పండగ సాయన్నకు అధికారిక గుర్తింపు తీసుకురావడంలో మంత్రి వాకిటి శ్రీహరి చేసిన కృషి అభినందనీయమన్నారు. తెలంగాణ చరిత్రలో పండగ సాయన్న పోరాట స్ఫూర్తిని భవిష్యత్ తరాలకు పరిచయం చేయడంలో ప్రభుత్వ నిర్ణయం కీలకమైనదని పేర్కొన్నారు. నిరంకుశ నిజాం పాలనను, అధికారుల దౌర్జన్యాలను ప్రశ్నించి ఎదిరించిన యోధుడిగా పండగ సాయన్న చరిత్రలో నిలిచిపోయారని వెంకన్న అన్నారు. తన సొంత పాలనా వ్యవస్థను ఏర్పాటు చేసుకుని, బహుజన రాజ్య స్థాపనకు ప్రయత్నించిన సాయన్నపై అప్పటి ఆధిపత్య శక్తులు, దేశ్‌ముఖ్‌లు, కరణాలు, పటేళ్లు, భూస్వాములు కుట్రలు, కుతంత్రాలు చేసినా వెనుకడుగు వేయకుండా పోరాడారని కొనియాడారు. అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడిన పండగ సాయన్నను తెలంగాణ బందూక్ రాబిన్‌హుడ్‌గా ప్రజలు గుర్తు చేసుకుంటారని వెంకన్న పేర్కొన్నారు. ఆయన పోరాట చరిత్రను యువతకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. మండల ప్రజలు ప్రతి సంవత్సరం అక్టోబర్ 22న పండగ సాయన్న జయంతిని, డిసెంబర్ 10న వర్ధంతిని ఘనంగా నిర్వహించి ఆయన ఆశయాలను స్మరించుకోవాలని పొన్నెబోయిన వెంకన్న పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం పండగ సాయన్నకు, ఆయన పోరాట స్ఫూర్తికి దక్కిన గౌరవంగా భావిస్తున్నామని తెలిపారు.

## అటవీ ప్రాంత సంరక్షణ కోసం సమన్వయంతో కృషి చేయాలి



**జిల్లా కమిటీ సమావేశంలో కలెక్టర్ భవేష్ మిశ్రా**

**జిల్లా నిజామాబాద్. విశాల భారతి**

నిజామాబాద్, ఆగస్టు 19 : జిల్లాలో అటవీ ప్రాంత సంరక్షణ కోసం వివిధ శాఖలు సమన్వయంతో కృషి చేయాలని కలెక్టర్ భవేష్ మిశ్రా సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో బుధవారం కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి అటవీ సంరక్షణ కమిటీ సమావేశం జరిగింది. జిల్లాలో అటవీ ప్రాంత విస్తీర్ణం పెంపొందించేందుకు చేపట్టాల్సిన చర్యలు, అటవీ భూముల ఆక్రమణల నిరోధం, వన్యప్రాణుల సంరక్షణ, అటవీ శాఖ అధికారులు, సిబ్బందిపై దాడులకు ఆస్కారం లేకుండా జాగ్రత్తలు చేపట్టడం, వనమహోత్సవం కింద విరివిగా మొక్కలు నాటడం, జల సంరక్షణ కార్యక్రమాల అమలు, వాల్టా చట్టం అమలు, అనువైన అటవీ ప్రదేశాలను పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దడం తదితర అంశాలపై చర్చించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. జిల్లాలో అటవీ శాఖపరంగా నెలకొని ఉన్న పరిస్థితుల గురించి జిల్లా అటవీ శాఖ అధికారి ప్రశాంత్ పాటిల్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్ దృష్టికి తెచ్చారు. జిల్లాలో 20 శాతానికి పైగా 86947.11 హెక్టార్లలో అటవీ ప్రాంతం విస్తరించి ఉందని తెలిపారు. అయితే, సిరికొండ, కమ్మర్పల్లి, కాల్పోల్ తండా, డీ.బీ.తండా, చందూర్ తదితర ప్రాంతాలలో అటవీ భూములు ఆక్రమణకు గురవుతున్నాయని, కబ్జాదారులపై చట్టపరంగా కఠిన చర్యలు చేపట్టేందుకు పోలీస్, రెవెన్యూ, పంచాయతీరాజ్ తదితర శాఖల తోడ్పాటు అవసరం ఉందని అన్నారు. ఈ విషయమై కలెక్టర్ స్పందిస్తూ, అటవీ ప్రాంత సంరక్షణకు ఆయా శాఖలు ఫారెస్ట్ డిపార్ట్ మెంట్ కు తప్పకుండా తగిన సహకారం అందించేలా చూస్తామన్నారు. అటవీ భూములను కబ్జా చేస్తే కఠిన చట్టాలను ఎదుర్కోవాల్సి వస్తుందని ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. సెప్టెంబర్ 1వ తేదీ నుండి ఆయా గ్రామాలలో విరివిగా సమావేశాలు నిర్వహిస్తూ, ప్రజల్లో అవగాహన పెంపొందించాలని అధికారులకు సూచించారు. వన్యప్రాణుల సంరక్షణ కోసం అన్ని చర్యలు చేపట్టాలని, చిరుతలు, ఇతర వన్యప్రాణులు రోడ్డు దాటే క్రమంలో ప్రమాదాలకు గురయ్యే అవకాశాలు ఉన్న చోట వాహనాల వేగాన్ని నియంత్రించేలా తగిన ఏర్పాట్లు చేయాలని అన్నారు. అటవీ సంపద పరిరక్షణ కోసం జిల్లాలో అవసరమైన సరిహద్దు ప్రదేశాలలో చెక్ పోస్టుల ఏర్పాటు కోసం ప్రతిపాదనలు పంపాలని సూచించారు. జల సంరక్షణ, భూగర్భ జల వనరుల పెంపు కోసం అటవీ ప్రాంతాలలో చెక్ డ్యాంలను నాణ్యతతో నిర్మించాలని, వన మహోత్సవంలో భాగంగా విరివిగా మొక్కలు నాటాలని అన్నారు. ఆర్మూర్ నగర వాటిక, నిజామాబాద్ లోని ఖిల్లా, నందిపేట లోని ఎస్సారెస్పి బ్యాక్ వాటర్ ఏరియా, అంకాపూర్ లోని మోడల్ స్కూల్ తదితర చోట్ల అటవీ శాఖ ఆధ్వర్యంలో పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేసే ప్రతిపాదనలకు జిల్లా యంత్రాంగం తరపున పూర్తి తోడ్పాటును అందిస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వి.భుజంగరావు, ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, అదనపు డీ.సీ.పీ శుభం నగ్రాలే, ట్రైనీ కలెక్టర్ సురేష్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, డీ.ఆర్.డీ.ఓ సాయన్న, నిజామాబాద్, బోధన్ ఆర్డీఓలు రాజేంద్రకుమార్, విజయకుమారి, ట్రైనీ ఆర్డీఓ సందీప్, ఏ.సీ.పీలు ప్రకాశ్, శ్రీనివాస్, వెంకటేశ్వర్ రెడ్డి, అటవీ, పోలీస్, రెవెన్యూ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పాపన్న గౌడ్ హామీని నెరవేర్చిన కాంగ్రెస్ ప్రభుత్వం

**అంబాల నారాయణగౌడ్ .. గౌడ ఐక్య సాధన సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు**




**ముషీరాబాద్,విశాల భారతి:** ఇచ్చిన హామీ మేరకు టాంక్ బండ్ పైన పాపన్న విగ్రహ ప్రతిష్ట ఆవిష్కరణ చేసిన ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి, పిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ లకు గౌడ ఐక్య సాధన సమితి తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నామని సమితి వ్యవస్థాపక అధ్యక్షులు అంబాల నారాయణ గౌడ్ తెలిపారు.గౌడ బహుజన వర్గాల ఆరాధ్యులైన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహ ఆవిష్కరణ నగరం నడిబొడ్డున చేపట్టం, చరిత్ర మరిచిన మహనీయునికి సముచిత గౌరవం అందించడం గొప్ప కార్యమని పేర్కొన్నారు.గౌడ్ బహుజనుల అస్తిత్వం ఆత్మ గౌరవం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యాన చిరస్థాయి గా నిలిచినందుకు గౌడ సమాజం పక్షాన ప్రత్యేక ధన్యవాధలు తెలిపారు.

## కెమెరా కన్నుతో ప్రపంచాన్ని చూపించడమే ఫోటోగ్రఫీ కళ

**మొయినాబాద్‌లో ఘనంగా ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకలు**



**మొయినాబాద్, ఆగస్టు 19 (విశాలభారతి):** ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని మొయినాబాద్ మండలంలోని పీకాక్ ఫోటోగ్రఫీ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఫోటోగ్రఫీ పితామహుడు లూయిస్ డాగ్యూరే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఫోటోగ్రాఫర్లు మాట్లాడుతూ.. ఒక్క ఫొటో ఎన్నో జ్ఞాపకాలను పదిలంగా ఉంచుతుందని, కాలం గడిచినా ఆ క్షణాలను కళ్లముందు నిలిపేది ఫోటోగ్రఫీ కళేనని అన్నారు. ఫోటోగ్రఫీ కేవలం చిత్రాన్ని తీయడం మాత్రమే కాదని, వెలుగు, నీడ, రంగులు, భావోద్వేగాలు, సందర్భాలను కలిపి ఒక కథను చెప్పే కళ అని పేర్కొన్నారు. మారుతున్న సాంకేతికతతో ఫోటోగ్రఫీలో అనేక మార్పులు వచ్చినప్పటికీ, మంచి ఫొటోకు సృజనాత్మక దృష్టి, సరైన క్షణాన్ని గుర్తించే నైపుణ్యం, ఫొటో ఆర్ట్‌పై అవగాహన ఎంతో ముఖ్యమని తెలిపారు. ఫోటోగ్రాఫర్లు సమాజంలో జరిగే ముఖ్యమైన సంఘటనలను భవిష్యత్ తరాలకు అందించే బాధ్యతను కూడా నిర్వర్తిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీకాక్ ఫోటోగ్రఫీ యూనియన్ మండల అధ్యక్షుడు శశిధర్, వాసు, మాణిక్ రెడ్డి, విష్ణు, నరసింహ, శ్రవణ్, మధు, నాగరాజ్, నవీన్, నరేష్, రామకృష్ణ తదితర ఫోటోగ్రాఫర్లు పాల్గొన్నారు.

## నీటి లభ్యతకు అనుగుణంగా పంటల సాగు




**మొయినాబాద్, ఆగస్టు 19(విశాలభారతి):** కేతిరెడ్డిపల్లి క్లస్టర్‌లో ATMA-RPL ఆధ్వర్యంలో రైతులకు ఆరుతడి పంటలు, వరి సాగు, సమగ్ర పంటల యాజమాన్యంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావం, నీటి లభ్యతకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవాలని శాస్త్రవేత్తలు సూచించారు. పంటల శాస్త్ర విభాగం డివిజన్ హెడ్ వి. మారుతి, CRIDA సీనియర్ శాస్త్రవేత్త డా. ఏ.జి.కె. రెడ్డి రైతులకు IPM, INM, నానో ఎరువుల వినియోగం, మల్చింగ్, ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పించారు. వరి సాగులో నాణ్యమైన రకాల ఎంపిక, నారుమడి పెంపకం, సరైన సమయంలో నాట్లు, సమతుల్య ఎరువుల వినియోగం, కలుపు, చీడపీడల నియంత్రణపై వివరించారు. నీటిని పొదుపుగా వినియోగించడంతో పాటు నేలలో తేమను కాపాడేందుకు మల్చింగ్ వంటి పద్ధతులను పాటించాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పి. అనురాధ, ఏఈఓలు దీనా, శ్రీనివాస్, కేతిరెడ్డిపల్లి క్లస్టర్ రైతులు పాల్గొన్నారు.

## ఉత్తమ సేవ పోలీసు అధికారులకు జర్నలిస్టులు ఘన సత్కారం



**విశాల భారతి ఇబ్రహీంపట్నం:** విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందిస్తూ పోలీసు శాఖకు, ప్రజలకు విశిష్ట సేవలు అందించినందుకు ప్రభుత్వం ద్వారా ఉత్తమ పతకాలు అందుకున్న ఇబ్రహీంపట్నం ఏసీపీ రాజు, ఇబ్రహీంపట్నం ఇన్‌స్పెక్టర్ మహేందర్ రెడ్డికి ఇబ్రహీంపట్నం TUWJH143 సీనియర్ జర్నలిస్టులు సూరమని సత్యనారాయణ, చండిశ్వర్, మహేందర్ తదితర జర్నలిస్టలతో కలిసి శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్టులు మాట్లాడుతూ.. పోలీసు అధికారులు విధి నిర్వహణలో చూపుతున్న అంకితభావం, క్రమశిక్షణ అభినందనీయమని అన్నారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజల సమస్యలను సానుకూలంగా పరిష్కరిస్తూ పోలీసు-ప్రజల మధ్య మరింత సత్సంబంధాలు పెంపొందించాలని ఆకాంక్షించారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, బాధితులకు న్యాయం జరిగేలా మరింత మెరుగైన సేవలు అందించాలని కోరారు. ఉత్తమ సేవలకు గుర్తింపుగా పతకాలు అందుకోవడం ఇబ్రహీంపట్నం పోలీసు శాఖకు గర్వకారణమని సీనియర్ జర్నలిస్టులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జర్నలిస్ట్ యూనియన్ టీయూడబ్ల్యూజే హెచ్ 143 ఇబ్రహీంపట్నం నియోజకవర్గ అధ్యక్షులు సురమోని సత్యనారాయణ, జిల్లా నాయకులు టి ఎం. చండీశ్వర్, చెరుకూరి మహేందర్, ప్రధాన కార్యదర్శి మొలుగు శ్రీనివాస్, ఉపాధ్యక్షులు హనుమంతు సుదర్శన్, కోశాధికారి నరేందర్ రెడ్డి, టెంజు ఉపాధ్యక్షులు ముచ్చర్ల నాగేష్, రాఘవేందర్, కోశాధికారి మహేందర్, ప్రచార కార్యదర్శి భూ చక్రం గౌడ్, ఎగ్జిక్యూటివ్ నెంబర్ స్ సురమోని బాబు, బస్వాపురం దశరథ, మేకల సురేష్, తదితరులు పాల్గొన్నారు.

# మారుతున్న నేరాలపై పోలీసుల పునర్వ్యవస్థీకరణ

**ట్రాఫిక్, రోడ్డు భద్రతకు పెద్దపీట: డీజీపీ సి.వి. ఆనంద్**

**రాజేంద్రనగర్, విశాల భారతి :**




మారుతున్న నేర స్వభావం, ప్రజా భద్రతకు ఎదురవుతున్న కొత్త సవాళ్లకు అనుగుణంగా తెలంగాణ పోలీసు శాఖలో మానవ వనరులను పునర్వ్యవస్థీకరిస్తున్నట్లు డీజీపీ సి.వి. ఆనంద్ తెలిపారు. బుధవారం తెలంగాణ పోలీస్ అకాడమీలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గతంలో వామపక్ష తీవ్రవాదం, ఉగ్రవాదం ప్రధాన సవాళ్లుగా ఉండగా, ప్రస్తుతం డ్రగ్స్, సైబర్ నేరాలు, ఆన్‌లైన్ బెట్టింగ్, పెట్టుబడి మోసాలు, ట్రాఫిక్ నిర్వహణ, రోడ్డు భద్రత, ఆహార కల్తీ వంటి అంశాలు కొత్త సవాళ్లుగా మారాయని పేర్కొన్నారు.

**513 మంది సిబ్బందికి కొత్త బాధ్యతలు**

గ్రేహౌండ్స్, ఆక్టోపస్, ఎస్ఐబీ తదితర ప్రత్యేక విభాగాల నుంచి మొత్తం 513 మంది సిబ్బందిని ఎనిమిది విభాగాలకు అవసరాలకు అనుగుణంగా కేటాయించినట్లు డీజీపీ తెలిపారు. వీరిలో ఐదుగురు ఇన్‌స్పెక్టర్లు, 22 మంది ఎస్ఐలు, 14 మంది ఏఎస్ఐలు, 84 మంది హెడ్ కానిస్టేబుళ్లు, 388 మంది కానిస్టేబుళ్లు ఉన్నారు. అత్యధికంగా 224 మందిని ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, రోడ్డు భద్రత విభాగానికి కేటాయించారు. ఆహార కల్తీ, డ్రగ్ కంట్రోల్‌కు 80 మంది, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు 79 మంది, సివిల్ సప్లయిస్‌కు 28 మంది, డీజీపీ కార్యాలయం-టిస్రార్‌కు 27 మంది, ఏసీబీ, సీఐడీ, సైబర్ సెక్యూరిటీ బ్యూరోలకు 25 మంది చొప్పున కేటాయించారు.

రెండు నెలల అటాచ్‌మెంట్ అనంతరం తుది కేటాయింపులు కొత్త బాధ్యతలు అప్పగించే ముందు సిబ్బందిని వివిధ విభాగాల్లో రెండు నెలల పాటు అటాచ్‌మెంట్‌పై పనిచేయించినట్లు డీజీపీ తెలిపారు. ప్రభుత్వ అనుమతితో ఆయా విభాగాల్లో పోస్టుల ఏర్పాటు ఆధారంగా తుది కేటాయింపులు చేపట్టామన్నారు. సిబ్బంది విద్యార్హతలు, అనుభవం, నేపథ్యాన్ని పరిశీలించడంతో పాటు వ్యక్తిగతంగా ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు వివరించారు. కొత్త విభాగాల విధులు, బాధ్యతలపై అవగాహన కల్పించేందుకు తెలంగాణ పోలీస్ అకాడమీలో 11 రోజుల ప్రత్యేక శిక్షణ అందించినట్లు తెలిపారు. తీవ్రవాదం నుంచి సైబర్ నేరాల వరకు తెలంగాణలో 1980, 1990 దశకాల్లో వామపక్ష తీవ్రవాదం తీవ్రంగా ఉండేదని డీజీపీ గుర్తుచేశారు. అప్పటి పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యేక పోలీసు బలగాల అవసరం ఏర్పడటంతో 1987లో అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు హయాంలో కేఎస్ వ్యాస్ నేతృత్వంలో ప్రత్యేక విభాగం ఏర్పడిందని తెలిపారు. అనంతరం గ్రేహౌండ్స్ రూపుదిద్దుకుందని, గ్రేహౌండ్స్, ఎస్ఐబీ తదితర విభాగాలు మావోయిస్టు కార్యకలాపాల నియంత్రణలో కీలక పాత్ర పోషించాయని పేర్కొన్నారు. 2017 తర్వాత తెలంగాణలో మావోయిస్టు కార్యకలాపాలు గణనీయంగా తగ్గాయని, అయితే ఛత్తీస్‌గఢ్, ఒడిశా, జార్ఖండ్ తదితర రాష్ట్రాల్లో కార్యకలాపాలు కొనసాగుతున్నాయని తెలిపారు. 2007లో హైదరాబాద్‌లోని లుంబినీ పార్క్, చార్మినార్ ప్రాంతాల్లో జరిగిన ఉగ్రదాడుల నేపథ్యంలో కౌంటర్ టెర్రరిజం సామర్థ్యాలను బలోపేతం చేయాల్సిన అవసరం ఏర్పడిందని, దాని ఫలితంగానే ఆక్టోపస్ వంటి ప్రత్యేక విభాగాలు అభివృద్ధి చెందాయని వివరించారు.

**విద్యార్థులపై డ్రగ్స్ పంజా**

యువతలో డ్రగ్స్ వినియోగం పెరుగుతుండటం ఆందోళన కలిగించే అంశమని డీజీపీ సి.వి. ఆనంద్ అన్నారు. గతేడాది 835 మంది విద్యార్థుల్లో డ్రగ్స్ ఆనవాళ్లు గుర్తించినట్లు తెలిపారు. మరో విశ్వవిద్యాలయంలో నిర్వహించిన అధ్యయనంలో సుమారు 70 శాతం మంది విద్యార్థులు డ్రగ్స్‌కు గురైనట్లు తేలిందని చెప్పారు. డ్రగ్స్ సరఫరా గొలుసును పూర్తిగా అడ్డుకోవడంతో పాటు విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యా సంస్థల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. పిల్లలను ఇప్పుడే కాపాడుకోకపోతే భవిష్యత్తులో పరిస్థితి మరింత తీవ్రంగా మారే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

**సైబర్ నేరాల్లో రూ.1,750 కోట్ల నష్టం**

సైబర్ నేరాలు కూడా పోలీసు శాఖకు ప్రధాన సవాలుగా మారాయని డీజీపీ తెలిపారు. ఆన్‌లైన్ బెట్టింగ్, పెట్టుబడి మోసాలు, నకిలీ యాప్‌ల ద్వారా మోసాలు పెరుగుతున్నాయని చెప్పారు. గత ఏడాది తెలంగాణలో సైబర్ నేరాల కారణంగా సుమారు రూ.1,750 కోట్ల ఆర్థిక నష్టం జరిగినట్లు తెలిపారు. సైబర్ నేరాల నియంత్రణకు ప్రత్యేక విభాగాలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు.

**రోడ్డు భద్రతకు పెద్దపీట**

తాజా పునర్వ్యవస్థీకరణలో రోడ్డు భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చినట్లు డీజీపీ తెలిపారు. గత ఏడాది తెలంగాణలో రోడ్డు ప్రమాదాల్లో సుమారు 8 వేల మంది ప్రాణాలు కోల్పోయారని చెప్పారు. ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నియంత్రణ, నిబంధనల అమలును మరింత బలోపేతం చేసేందుకు 224 మంది సిబ్బందిని ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, రోడ్డు భద్రత విభాగానికి కేటాయించినట్లు వెల్లడించారు. ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి, అక్కడ ఉన్న ఇంజినీరింగ్ లోపాలను సరిదిద్దేందుకు సంబంధిత ప్రభుత్వ శాఖలతో కలిసి పనిచేస్తామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక రోడ్డు భద్రత కార్యక్రమాన్ని చేపట్టేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు.

**క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలి**

కొత్త బాధ్యతలు స్వీకరిస్తున్న సిబ్బంది నిజాయితీ, నిబద్ధతతో విధులు నిర్వహించాలని డీజీపీ సూచించారు. శారీరక దారుఢ్యాన్ని కాపాడుకోవడంతో పాటు విధుల్లో నిర్లక్ష్యానికి తావివ్వకూడదన్నారు. కొత్త బాధ్యతలకు అనుగుణంగా తమను తాము తీర్చిదిద్దుకుని క్రమశిక్షణతో, వృత్తి నైపుణ్యంతో పనిచేయాలని సూచించారు. గ్రేహౌండ్స్, ఆక్టోపస్ విభాగాల్లో ఫీల్డ్ ఆపరేషన్లు, నిర్వహణ, శిక్షణ తదితర అవసరాలకు సరిపడా సిబ్బందిని కొనసాగించినట్లు తెలిపారు. మూడు నెలల అనంతరం సిబ్బంది అవసరాలు, పనితీరును మరోసారి సమీక్షిస్తామని డీజీపీ సి.వి. ఆనంద్ వెల్లడించారు. కార్యక్రమంలో ఆక్టోపస్, సీఐడీ, ఎస్ఐబీ, ఇంటెలిజెన్స్ తదితర ప్రత్యేక విభాగాలకు చెందిన సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

## మంతన్ గౌరేల్లి రెవిన్యూ

- **106 సర్వే నెంబర్లో భూకబ్జా .. అక్రమంగా కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి**
- **డిప్యూటీ తహసిల్దార్‌కు వినతి పత్రం అందజేత**
- **సిపిఎం మండల కార్యవర్గ సభ్యులు చందు నాయక్**



**విశాల భారతి ఇబ్రహీంపట్నం :** యాచారం మండల పరిధిలో మంతన్ గౌరేల్లి రెవెన్యూ పరిధిలో ఉన్న సర్వే నెంబర్ 106 అసైన్మెంట్ ప్రభుత్వ భూమిని అక్రమంగా కబ్జా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని, సిపిఎం మండల కార్యవర్గ సభ్యులు ఎస్ చందు నాయక్ అన్నారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ మండల కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ చందు నాయక్, మాజీ సర్పంచ్ విజయలక్ష్మి కిషన్ నాయక్, మాజీ ఎంపిటిసి తావు నాయక్ మాట్లాడుతూ మంతన్ గౌడ్ రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 106 అసైన్మెంట్ ప్రభుత్వ భూమిని కొంతమంది భూ బకాసురులు, రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు, వచ్చి ఆ భూమిలో ఉన్న చెట్లను తొలగించి ఆ భూమిని అక్రమంగా కబ్జా చేసుకోవడానికి మేము తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. అధికారులు తక్షణమే స్పందించి 106 సర్వే నెంబర్ ను తక్షణమే సర్వే చేయించి హద్దులు పెట్టి ఆ భూమిని రక్షించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో గ్రామంలో ఉన్న పేద ప్రజలను కలుపుకొని తాహసిల్దార్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.తధనతరం యాచారం డూప్యూటీ తహసీల్దార్ కీర్తి సాగర్ కు వినతి పత్రాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో వార్డ్ నెంబర్ రోజా నరసింహ, మాజీ వార్డ్ నెంబర్ మాన్ సింగ్, నాయకులు కే గణేష్, ఎన్ శంకర్, బి జంగయ్య కే కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## రాజేంద్రనగర్ మండల పీఆర్టీయూ నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక



**రాజేంద్రనగర్, విశాల భారతి :** రాజేంద్రనగర్ మండలం పీఆర్టీయూ మండల శాఖ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. బుధవారం శివరాంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా పీఆర్టీయూ శాఖ అధ్యక్షులు సామల మహేందర్ రెడ్డి నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. మండల శాఖ నూతన అధ్యక్షులుగా సుదర్శన్ కడుమూరు, ప్రధాన కార్యదర్శిగా ఆస్కానీ శ్రీనివాస సాగర్, గౌరవ అధ్యక్షులుగా మాణిక్యం రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆయన తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి నూతన కార్యవర్గం కృషి చేయాలని ఈ సందర్భంగా నాయకులు సూచించారు. ఈ కార్యక్రమంలో శివరాంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు భూక్య శ్రీనాయక్, రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి కొనగారి కృష్ణారెడ్డి, అధికార మాసపత్రిక సంపాదకులు జగన్మోహన్ గుప్తా, గౌరవ అధ్యక్షులు పెద్దమారు రాఘవేందర్ పాల్గొన్నారు. ఎన్నికల పరిశీలకులుగా శివరామ్, హనుమంతు, రాజశేఖర్ గౌడ్, సురేష్, సుధాకర్, వహీద్ వ్యవహరించారు. అలాగే మండల కార్యవర్గ సభ్యులు రవీందర్ రెడ్డి, కిరణ్ కుమార్ రెడ్డి, సత్యన్నా, అల్లవెల్లి, రోహిణి తదితరులు పాల్గొన్నారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులకు పలువురు నాయకులు అభినందనలు తెలిపారు. ఉపాధ్యాయుల సంక్షేమం, వారి సమస్యల పరిష్కారం, విద్యా రంగ అభివృద్ధికి సమన్వయంతో పనిచేస్తామని నూతన కార్యవర్గ సభ్యులు తెలిపారు.

## కల్లుగీత కార్మికుల హక్కుల కోసం ఐక్య పోరాటం

**అబ్దుల్లాపూర్‌మెట్ మండల కల్లుగీత కార్మిక సంఘం నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక**



**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** అబ్దుల్లాపూర్‌మెట్ మండల కల్లుగీత కార్మిక సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రంగారెడ్డి జిల్లా కల్లుగీత కార్మిక సంఘం అధ్యక్షులు వర్కల బాలరాజ్ గౌడ్ హాజరై నూతన కమిటీ సభ్యులను అభినందించారు. మండల కల్లుగీత కార్మిక సంఘం అధ్యక్షులుగా సుర్వు పోచయ్య, కార్యదర్శిగా మేడిపల్లి శ్రీశైలం, ఉపాధ్యక్షులుగా గోపగోని కుమార్, పూజారి భాస్కర్, సహాయ కార్యదర్శిగా ధంతూరి సతీష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వర్కల బాలరాజ్ గౌడ్ మాట్లాడుతూ.. కల్లుగీత కార్మికుల హక్కులు, సంక్షేమం కోసం సంఘం ఐక్యంగా పనిచేయాలని సూచించారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటాలు కొనసాగించాలని అన్నారు. గీత కార్మికుల భద్రత, పెన్షన్లు, పరిహారం, సంక్షేమ పథకాలు, వృత్తి పరిరక్షణ వంటి అంశాలపై సంఘాన్ని మరింత బలోపేతం చేయాలని ఆకాంక్షించారు. నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని ప్రతి కల్లుగీత కార్మికుడికి అండగా నిలిచి వారి సమస్యల పరిష్కారానికి ఐక్యంగా కృషి చేస్తామని తెలిపారు. కల్లుగీత కార్మికుల హక్కుల సాధన కోసం భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు, పోరాటాలు చేపడతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కల్లుగీత కార్మిక సంఘం నాయకులు, కార్యకర్తలు, గీత కార్మికులు పాల్గొని నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రయోజనాల కోసమే పని చేస్తున్నా పాలకులు




- **యువత విద్యార్థి నిరుద్యోగులను పట్టించుకోని ప్రభుత్వాలు**
- **విద్య వైద్యం ఉద్యోగం ఉపాధి లేకపోవడం వలన యువత యువశక్తి పార్టీ ఏర్పాటు**
- **యువశక్తి పార్టీ రాష్ట్ర అధ్యక్షులు మడ్డి రాజు గౌడ్**
- **ఎస్వీకే లో యువశక్తి పార్టీ ఆవిర్భావం**

**ముషీరాబాద్, విశాల భారతి:** పాలకులు వారి ప్రయోజనాల కోసమే పని చేస్తున్నారని యువశక్తి పార్టీ రాష్ట్ర అధ్యక్షులు మడ్డి రాజు గౌడ్ అన్నారు. యువత, విద్యార్థులు నిరుద్యోగులను ఏ ప్రభుత్వాలు పట్టించుకోవడంలేదని విమర్శించారు. విద్య వైద్యం ఉద్యోగం ఉపాధి లేకపోవడం వల్లనే యువత పార్టీని ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. బుధవారం బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో యువశక్తి పార్టీ ఆవిర్భవ సభ జరిగింది. ఈ సభలో రాష్ట్ర అధ్యక్షులు రాజు గౌడ్ పార్టీ జెండాను మ్యానిఫెస్టోను ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థులకు పోటీ పరీక్షలకు సంబంధించిన స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశాబ్దాల కాలంగా ప్రభుత్వాలు ప్రజలను మోసం చేస్తూనే ఉన్నాయని దాని మార్పు కోసమే యువశక్తి పార్టీ ఆవిర్భవించిందన్నారు. రాజకీయ పార్టీలు పాలకులు విద్యార్థులు నిరుద్యోగులు ప్రజల కోసం కాకుండా వారి సొంత ప్రయోజనాల కోసం పనిచేస్తున్నారని విమర్శించారు. గత ప్రభుత్వం నుంచి నేటి ప్రస్తుత ప్రభుత్వం వరకు నోటిఫికేషన్లు లేవని ఉద్యోగాలు లేకుంటే విద్యార్థులు చదువుకొని ఏం చేస్తారని ప్రశ్నించారు. ప్రతి సంవత్సరం విద్యార్థులు పెరుగుతున్నప్పుడు దాని తగ్గట్టుగా బడ్జెట్ కేటాయించాల్సింది పోయి కేవలం విద్యకు బడ్జెట్ లో ఏడు శాతమే నిధులు కేటాయించడం దుర్మార్గమన్నారు. ప్రవేట్ కార్పోరేట్ పాఠశాలలు కళాశాలలు లక్షల కోట్లు దోచుకుంటుంటే విద్య ఎలా బాగుపడుతుందని ప్రశ్నించారు. యువశక్తి పార్టీ యువతకు ఉద్యోగాలు నైపుణ్య అభివృద్ధి రైతు సంక్షేమం పంటకు గిట్టుబాటు ధర నాణ్యమైన విద్య వైద్యం ఉచితంగా ఇవ్వడం ప్రధాన ఎజెండా అన్నారు. అభివృద్ధి చెందిన గ్రామాలకు మౌలిక సదుపాయాలు, పారదర్శక పాలన, డిజిటల్ సేవలు, అవినీతి రహిత పాలన, ప్రజాధనానికి రక్షణ, మహిళా సాధికారత, సమాన అవకాశాలు, పర్యావరణ పరిరక్షణ, స్వచ్ఛమైన తెలంగాణ సామాజిక న్యాయం అందరికీ గౌరవం అనే నినాదంతో ముందుకు వెళ్తున్నమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సందీప్ యాదవ్, అరుణ్, తరుణ్, నరేష్, విద్యార్థి నాయకులు, మహిళ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## పైపులైన్ పగిలి 15 రోజులైనా.. పట్టించుకోరా?

- **పసుమాములలో తాగునీటి కోసం ప్రజల అవస్థలు**
- **వృథాగా పోతున్న నీటిని అరికట్టి సమస్య పరిష్కరించాలని కమిషనర్‌కు వినతి**

**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :**

మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పెద్దఅంబర్‌పేట డివిజన్ పసుమాముల వివేకానందనగర్ కాలనీలో తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరుతూ కాలనీ వాసులు బుధవారం కమిషనర్ సంపత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కాలనీకి ప్రధాన రహదారి మీదుగా వచ్చే మంచినీటి పైపులైన్ పగిలి 15 రోజులుగా నీరు వృథాగా పోతున్నా సంబంధిత వాటర్ వర్క్స్ అధికారులు పట్టించుకోవడం లేదని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవైపు నీరు వృథాగా పోతుండగా, మరోవైపు కాలనీలోని ప్రజలు మంచినీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పైపులైన్ లీకేజీని వెంటనే అరికట్టి, మరమ్మతులు చేపట్టి కాలనీకి నిరంతర మంచినీటి సరఫరా అందేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను కోరారు. సమస్యను సంబంధిత వాటర్ వర్క్స్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి అత్యవసరంగా పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. నీటి సమస్యను ఇకనైనా అధికారులు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే స్పందించి ప్రజల ఇబ్బందులు తొలగించాలని కాలనీ వాసులు కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు గూడెపు రాజుగౌడ్, లక్ష్మణ్, రవీందర్, నర్సింహా, చాంద్ పాషా తదితరులు పాల్గొన్నారు.



## నూతన ఓటర్ల నమోదుకు కదలాలి



**విశాల భారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** నూతన ఓటర్ల నమోదు కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని అర్హులైన యువతకు ఓటు హక్కు కల్పించేలా కృషి చేయాలని యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్‌రెడ్డి పిలుపునిచ్చారు. గాంధీభవన్‌లో సంఘటన్ శ్రీజన్ అభియాన్ చైర్మన్ వేణుగోపాల్‌గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన నూతన ఓటర్ నమోదు పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జి సయ్యద్ ఖాలిద్ అహ్మద్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా శివచరణ్‌రెడ్డి మాట్లాడుతూ.. మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ యువతను దేశ నిర్మాణంలో కీలక శక్తిగా తీర్చిదిద్దేందుకు అనేక చర్యలు తీసుకున్నారని అన్నారు. ఓటు హక్కు వయస్సును 21 ఏళ్ల నుంచి 18 ఏళ్లకు తగ్గించి యువతకు నిర్ణయాత్మక పాత్ర కల్పించిన ఘనత రాజీవ్‌గాంధీకి దక్కుతుందని తెలిపారు. ఆగస్టు 20న రాజీవ్‌గాంధీ జయంతిని పురస్కరించుకుని ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ ఆదేశాల మేరకు యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నూతన ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రతి బూత్ పరిధిలో కాంగ్రెస్ నాయకులు, బూత్ లెవల్ ఏజెంట్ల సమన్వయంతో అర్హులైన యువతను గుర్తించి ఓటర్లుగా నమోదు చేయించాలని యువజన కాంగ్రెస్ శ్రేణులను కోరారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు యరమల రామచంద్రారెడ్డి, చంద్రిక, గుర్రం శ్యామ్ చరణ్ రెడ్డి, పాలడుగు నాగార్జున,యువజన కాంగ్రెస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు నాగేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

## శ్రీ సీతారామాంజనేయ స్వామి నూతన దేవాలయ విగ్రహ ప్రతిష్ఠ

**రాముడు ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి .. మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి**



**విశాల భారతి ఇబ్రహీంపట్నం:** ఇబ్రహీంపట్నం మండలం పరిధిలోని చర్లపటేల్‌గూడ గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠ అంగరంగ వైభవంగా, భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించారు. మూడు రోజులుగా కొనసాగిన ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భాగంగా స్వామివారి విగ్రహ ప్రతిష్ఠను వేద పండితుల మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల నడుమ అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి హాజరయ్యారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు గ్రామస్తులు, ఆలయ నిర్వాహకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం మంచిరెడ్డి కిషన్ రెడ్డి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి, వేద పండితుల ఆశీర్వాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా మంచిరెడ్డి కిషన్ రెడ్డి మాట్లాడుతూ, శ్రీ సీతారామాంజనేయ స్వామి ఆశీస్సులు ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని, కుటుంబాల్లో ఆనందం వెల్లివిరియాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. అలాగే, రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులు, ప్రజలు సుభిక్షంగా ఉండాలని, పంటలు బాగా పండాలని కోరుకున్నట్లు చెప్పారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల్లో భక్తిభావంతో పాటు ఐక్యతను పెంపొందిస్తాయని, దేవాలయాల అభివృద్ధికి గ్రామ ప్రజలు చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. శ్రీ సీతారామాంజనేయ స్వామి ఆలయ విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కాల గణేష్, ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్మన్ టేకుల సుదర్శన్ రెడ్డి, మాజీ ఎంపీపీ పందిరి కృపేష్, కౌన్సిలర్లు, క్యామ శంకర్, చిలకల బుగ్గ రాములు, జెర్కోని రాజు బిఆర్ఎస్ పార్టీ నాయకులు గ్రామ పెద్దలు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రపతి అవార్డు గ్రహీత అదనపు డీసీపీ నరసయ్యకు సన్మానం




**సికింద్రాబాద్ విశాల భారతి :** స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా కేంద్ర హోం శాఖ ద్వారా రాష్ట్రపతి ఉత్తమ పోలీస్ పతకం పొందిన సికింద్రాబాద్ జోన్ అడిషనల్ డిసిపి జోగుల నరసయ్యను బుధవారం గంగపుత్ర సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. బిజెపి సీనియర్ నాయకులు అదనపు డీసీపీని మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమం లో గంగపుత్ర సంఘం నాయకులు గడప శ్రీహరి , ఎర్రబోయిన మల్లేశ్ , మెట్టు సూర్యప్రకాశ్, డోలి రమేష్ , గుడబోయిన శివలింగం, కంది నారాయణ, మద్దెర్ల శ్యాంసుందర్, మంగిలిపల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ మోసాలపై జాగ్రత్త

**తెలియని కాల్స్, లింకులతో అప్రమత్తం.. సీనియర్ సిటిజన్లకు పోలీసుల అవగాహన**




**విశాల భారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మల్కాజిగిరి సైబర్ క్రైమ్ డీసీపీ నాగలక్ష్మి సూచించారు. సైబర్ జాగరూకత దివస్ సందర్భంగా నాగోల్ పోలీస్ స్టేషన్‌లో సీనియర్ సిటిజన్లకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిజిటల్ అరెస్టు, పెట్టుబడుల పేరుతో మోసాలు, పార్ట్‌టైమ్ ఉద్యోగాలు, ఓఎల్ఎక్స్, ఆన్‌లైన్ షాపింగ్, కస్టమర్ కేర్, రుణాలు, మ్యాట్రిమోనియల్ మోసాలతో పాటు ఓటీపీ, యూపీఐ మోసాలు, ఫిషింగ్, సామాజిక మాధ్యమాల వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. తెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, సందేశాలు, అనుమానాస్పద లింకులను నమ్మవద్దని పోలీసులు సూచించారు. బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీ, యూపీఐ పిన్, వ్యక్తిగత సమాచారాన్ని ఎవరితోనూ పంచుకోవద్దని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో మోసగాళ్ల ఒత్తిడికి గురికాకుండా, విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఇంటర్నెట్, సామాజిక మాధ్యమాలను బాధ్యతాయుతంగా వినియోగిస్తూ అప్రమత్తంగా ఉంటే సైబర్ మోసాలను చాలా వరకు నివారించవచ్చని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సుమారు 60 మంది సీనియర్ సిటిజన్లు పాల్గొన్నారు. మల్కాజిగిరి సైబర్ క్రైమ్ డీసీపీ నాగలక్ష్మి, ఏసీపీ శివశంకర్ గౌడ్, నాగోల్ ఇన్‌స్పెక్టర్ మహమ్మద్ మక్బూల్ జానీ, ఎస్ఐలు పి. శివ నాగ ప్రసాద్, మమతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గర్భిణులు, శిశువుల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి

**జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా.**

**విశాల భారతి, నిర్మల్ :** జిల్లాలో గర్భిణులు, బాలింతలు, శిశువుల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, బుధవారం సాయంత్రం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో, వైద్యారోగ్య శాఖ 'అంకురం ' కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భం దాల్చిన నుంచి ప్రసవం అయ్యే వరకు తప్పనిసరిగా పర్యవేక్షణ ఉంచాలన్నారు. గర్భిణుల్లో ఆరోగ్య సమస్యలు ఉంటే వారిపై ప్రత్యేక శ్రద్ధ ఉంచి, వారిని సంరక్షించాలన్నారు. ఎన్ఎంఆర్ సంఖ్యను సింగిల్ డిజిట్ కి పరిమితం చేయడమే అంకురం కార్యక్రమం లక్ష్యమని పేర్కొన్నారు. ప్రత్యేక ప్రణాళికల ద్వారా గర్భిణులు, బాలింతలు, శిశువుల రక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు గర్భిణులకు అవసరమైన అన్ని పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వారిగా వైద్యాధికారులు గర్భిణులు తప్పనిసరిగా సంబంధిత చికిత్సలు తీసుకునేలా పర్యవేక్షణ ఉంచాలని అన్నారు.

# మహిళలను ప్రగతి పథంలో ముందుంచడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

- **ఖైతలపూర్ డివిజన్ ప్రెసిడెంట్ కలికోట శంకర్**
- **ప్రజా ప్రభుత్వం మహిళల సంక్షేమానికి కట్టుబడి ఉంది – కలికోట శంకర్**



**కూకట్ పల్లి విశాల భారతి:** కూకట్‌పల్లి నియోజకవర్గం ఖైతలపూర్ డివిజన్ హబీబ్ నగర్‌లో ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎండి మోయిజ్, ఖైతలపూర్ డివిజన్ ప్రెసిడెంట్ కలికోట శంకర్ హాజరై మహిళలకు చీరలను అందజేశారు. ఈ సందర్భంగా డివిజన్ ప్రెసిడెంట్ కలికోట శంకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలో ఉన్న ప్రజా ప్రభుత్వం మహిళల సంక్షేమం మరియు సాధికారతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. ప్రగతి పథంలో మహిళలను ముందుంచడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఇందిరమ్మ రాజ్యం అంటేనే పేదల సంక్షేమం, మహిళల గౌరవమని పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు అక్బర్, ఆరిఫ్, సుల్తాన్, శ్రవణ్, షాకీర్, అహల్లుద్దీన్, జోగ్గా, జహీర్, జావేద్, తబ్రేజ్, అజీజ్, వినోద్, జైనుద్దీన్, రవి, అజయ్, మహిళా నాయకురాలు జోజ్జమ్మ, RP సభ్యులు ఈశ్వరి, విజయలక్ష్మి మరియు ఇతర కార్యకర్తలు, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

# నాయి బ్రాహ్మణుల కులవృత్తి పరికరాలకు రాయితీలు ఇవ్వాలి బి.జె.పి నేత రవి ప్రసాద్ గౌడ్



**సికింద్రాబాద్, విశాల భారతి :** తెలంగాణ నాయి బ్రాహ్మణ సంఘం సీతాఫల్మండి, బౌద్ధనగర్, శికలగూడ ప్రాంత నూతన అధ్యక్షునిగా గర్కుంట్ల శంకర్ నాయి నియమితులైన సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవి ప్రసాద్ గౌడ్ శంకర్ నాయి ని శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా నాయి బ్రాహ్మణ కార్మికులు తమ వృత్తిపరమైన ఇబ్బందులను రవి ప్రసాద్ గౌడ్ దృష్టికి తీసుకువచ్చారు. నాయి బ్రాహ్మణులు ప్రధానంగా సాంప్రదాయ క్షుర వృత్తి పై ఆధారపడి జీవిస్తున్నారని, కానీ ప్రస్తుతం అనేక సవాళ్లు ఎదుర్కొంటున్నారని రవి ప్రసాద్ గౌడ్ తెలిపారు.అసంఘటిత కార్మికుల చట్టం 2008 కింద నాయి బ్రాహ్మణులను నమోదు చేసి, ఇ-శ్రమ్ కార్డులు, పెన్షన్, బీమా సౌకర్యాలు కల్పించాలని సెలూన్ టూల్స్, చైర్స్, ఇతర పరికరాల కొనుగోలుకు రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీతో రుణాలు ఇవ్వాలని ప్రతి క్షుర వృత్తిదారునికి ప్రభుత్వ గుర్తింపు కార్డు ఇచ్చి, ఆరోగ్య బీమా, ప్రమాద బీమా వర్తింపజేయాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవి ప్రసాద్ గౌడ్ అన్నారు సామాజిక భద్రత వృద్ధ కార్మికులకు నెలకు కనీస పెన్షన్, మహిళా నాయి కార్మికులకు ప్రసూతి సెలవులు వర్తింపజేయాలి.నాయి బ్రాహ్మణ కార్మికులు సమాజానికి అందించే సేవలు గొప్పవని, వారి సంక్షేమం కోసం భారతీయ జనతా పార్టీ కట్టుబడి ఉందని రవి ప్రసాద్ గౌడ్ అన్నారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన ఇ-శ్రమ్ పోర్టల్, పీఎం స్వనిధి, విశ్వకర్మ యోజన వంటి పథకాలు నాయి బ్రాహ్మణ కార్మికులకు ఎంతో ఉపయోగపడతాయని . వీటి గురించి ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించి, నమోదు చేయిస్తామని రవి ప్రసాద్ గౌడ్ తెలిపారు రాష్ట్ర ప్రభుత్వం నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు, కార్మికులకు ప్రత్యేక నిధులు కేటాయించాలని ఒత్తిడి తెస్తామని కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం బీజేపీ ఎల్లప్పుడూ పోరాడుతుందని, నూతన అధ్యక్షులు శంకర్ నాయి నాయకత్వంలో సంఘం మరింత బలోపేతం కావాలని రవి ప్రసాద్ గౌడ్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆర్. వి. రమణ. హరినాథ్ నాయి. మనోహర్ నాయి . జె.రాంబాబు నాయి. ఓం ప్రకాష్‌నాయి. రమేష్‌నాయి. భాస్కర్ నాయి. శేఖర్ నాయి. వెంకటేష్‌నాయి. సత్యనారాయణ నాయి. వెంకటేష్‌నాయి. తదితర కుల పెద్దలు పాల్గొన్నారు

# వరంగల్ మహాసభకు కదలాలి.. ఉద్యమాన్ని గ్రామస్థాయిలో బలోపేతం చేయాలి




**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** సెప్టెంబర్ 9న వరంగల్‌లో నిర్వహించనున్న ఎంఎస్పీ, ఎమ్మార్పీఎస్ మండల కమిటీల జాతీయ మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి రాగళ్ల ఉపేందర్ మాదిగ పిలుపునిచ్చారు. గ్రామస్థాయి నుంచే ఉద్యమాన్ని బలోపేతం చేసి పీడిత, అణగారిన వర్గాల హక్కుల కోసం బలమైన పోరాటాలను నిర్మించాలని ఆయన అన్నారు. ఎల్‌బీనగర్ నియోజకవర్గం హయత్‌నగర్ మండల కార్యాలయంలో ఎంఆర్పీఎస్, అనుబంధ విభాగాల నియోజకవర్గ సమావేశం ఎంఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎర్ర రవీందర్ మాదిగ అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన రాగళ్ల ఉపేందర్ మాదిగ మాట్లాడుతూ.. పేదరిక నిర్మూలన, అణగారిన వర్గాల ఆర్థిక అభివృద్ధి, సామాజిక సమానత్వం కోసం నిరంతర పోరాటాలు అవసరమన్నారు. కుల వివక్ష, మత దురహంకారం, సామాజిక అసమానతలు లేని సమసమాజ నిర్మాణం కోసం మహనీయుల ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. కుల వ్యవస్థ కారణంగా మెజారిటీ అణగారిన వర్గాలు పేదరికంలోనే కొనసాగుతున్నాయని, దోపిడీ, పీడన, అసమానతలకు తావులేని సమాజ నిర్మాణమే లక్ష్యంగా ఉద్యమించాలని అన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటిపై ప్రజా ఉద్యమాలను నిర్మించాలని, గ్రామస్థాయిలో ఎమ్మార్పీఎస్‌ను మరింత శక్తివంతంగా తీర్చిదిద్దాలని సూచించారు. గ్రామ కమిటీల ఏర్పాటులో నాయకులు నిర్లక్ష్యం వీడి వెంటనే గ్రామాల్లో పర్యటించాలని, రాజకీయ పార్టీలకు సంబంధం లేని చదువుకున్న యువతను కమిటీల్లో భాగస్వామ్యం చేసి ఉద్యమానికి కొత్త బలాన్ని తీసుకురావాలని కోరారు. సెప్టెంబర్ 5లోపు గ్రామ, మండల కమిటీల నిర్మాణాన్ని పూర్తి చేసి వరంగల్ జాతీయ మహాసభకు సిద్ధం కావాలని తెలిపారు. ఈ సమావేశంలో ఎల్‌బీనగర్ మాజీ ఇన్‌చార్జి బత్తిన సుధాకర్ మాదిగ, ఎర్ర రవీందర్ మాదిగ, జాతీయ నాయకులు భారత్ మాదిగ, ఎల్‌బీనగర్ ఇన్‌చార్జి కొమ్ము రాజశేఖర్ మాదిగ, ఎంఎస్పీ సీనియర్ నాయకులు మల్లెపూగు రాజు, హేమంత్, నరసింహారావు, బీ. రాజు, క్రాంతి మాదిగ, సతీష్ మాదిగ, ఈ. చంటి, ఎం. అర్జున్, ఎం. రాజు, ఈ. ప్రశాంత్, ఈ. నాగరాజ్, ఎం. మల్లేష్, కె. లింగయ్య, ఈ. సునీల్, ఎం. వీరన్న, ఎం. వెంకటేష్, ఎం. మహేష్, పి. రాజు తదితరులు పాల్గొన్నారు.

# టైగర్ ఆలే నరేంద్ర 80వ జయంతికి పెద్ద ఎత్తున తరలిరావాలి

**మన ఆలోచన సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షులు కటకం నర్సింగ్‌రావు పిలుపు**

**విశాల భారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** టైగర్ ఆలే నరేంద్ర 80వ జయంతి వేడుకలకు ఉద్యమకారులు, మేధావులు, కవులు, రచయితలు, ప్రజాప్రతినిధులు, కార్మికులు, కర్షకులు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మన ఆలోచన సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షులు కటకం నర్సింగ్‌రావు పిలుపునిచ్చారు. హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మధ్యాహ్నం 2 గంటలకు జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. టైగర్ ఆలే నరేంద్ర చేసిన సేవలను స్మరించుకుంటూ ఘనంగా నివాళులర్పించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాస్ రాష్ట్ర అధికార ప్రతినిధి మంగిలిపల్లి శంకర్, మాస్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి పెద్దవూర బ్రహ్మయ్య, శ్రీకాంత్, రవి తదితరులు పాల్గొన్నారు.



# జీవో నంబర్ 97ను రద్దు చేయాలి

- **పాలిటెక్నిక్, డిప్లొమా విద్యార్థులకు అన్యాయం జరుగుతుందంటూ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ వినతి**

**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :**




తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నంబర్ 97ను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్), స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఎఫ్ఐ) నాయకులు బుధవారం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి వినతిపత్రం అందజేశారు. పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులతో కలిసి ఏఐఎస్ఎఫ్ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు భూక్యా వినోద్ నాయక్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు గుండె శివకుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు భూక్యా వినోద్ నాయక్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు గుండె శివకుమార్ మాట్లాడుతూ.. జీవో నంబర్ 97 ద్వారా పాలిటెక్నిక్, డిప్లొమా కోర్సులను యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో విలీనం చేయాలనే నిర్ణయం తీసుకోవడం వల్ల విద్యార్థుల్లో తీవ్ర ఆందోళన నెలకొన్నదన్నారు. ఈ నిర్ణయం ముఖ్యంగా నిరుపేద, గ్రామీణ విద్యార్థులపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం తక్కువ ఖర్చుతో పాలిటెక్నిక్, డిప్లొమా విద్యను అభ్యసించే అవకాశం ఉండటంతో గ్రామీణ ప్రాంతాలకు చెందిన అనేక మంది పేద విద్యార్థులు సాంకేతిక విద్యను కొనసాగిస్తున్నారని వారు తెలిపారు. అయితే విద్యా వ్యవస్థలో మార్పుల కారణంగా భవిష్యత్తులో విద్యా ఖర్చులు పెరిగితే పేద విద్యార్థులు ఈ కోర్సులకు దూరమయ్యే ప్రమాదం ఉందన్నారు. ఉన్నత విద్యను అభ్యసించే అవకాశాలు తగ్గడంతో పాటు, సాంకేతిక విద్య ద్వారా ఉపాధి అవకాశాలను పొందాలనుకునే విద్యార్థులకు కూడా ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. పాలిటెక్నిక్, డిప్లొమా కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో అనేక అవకాశాలు ఉన్నాయని, ప్రస్తుత విధానంలో మార్పులు చేస్తే భవిష్యత్తులో ప్రభుత్వ ఉద్యోగ అవకాశాలపైనా ప్రభావం పడే ప్రమాదం ఉందని నాయకులు అన్నారు. ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని జీవో నంబర్ 97పై సమగ్రంగా పునఃసమీక్ష చేయాలని, విద్యార్థులు, విద్యావేత్తల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని వెంటనే ఆ జీవోను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.విద్యార్థుల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వారికి న్యాయం జరిగేలా తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సానుకూలంగా స్పందించినట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ అబ్దుల్లాపూర్‌మెట్ మండల సహాయ కార్యదర్శి సత్యం, మండల కార్యవర్గ సభ్యులు చందు, ఏఐఎస్ఎఫ్ నాయకులు నిఖిల్, ఎస్ఎఫ్ఐ నాయకులు శశి, పాషా, విద్యార్థులు ఎండీ అస్లాం, ఎండీ ఆఫనాన్, చరణ్, అభినవ్, ముకేశ్‌తో పాటు పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## బ్యాంకులే రైతుల వద్దకు వెళ్లి రుణాలు అందించాలి

**మొదటి పేజీ తరువాయి**




మహిళా పారిశ్రామికవేత్తలు, గ్రామీణ పరిశ్రమలు, యువతకు ఉపాధి, గ్రీన్-క్లైమేట్ ఫైనాన్స్, డిజిటల్ ఆర్థిక సేవల విస్తరణకు ఇందులో ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. రైతులు రుణాల కోసం బ్యాంకుల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండకూడదని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. బ్యాంకులే రైతుల వద్దకు వెళ్లి అవసరమైన సమయంలో రుణాలు అందించాలని సూచించారు. రైతులకు రుణ సదుపాయం కల్పించడంతో పాటు వారి ఆదాయం పెరిగేలా రుణ విధానాలను రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలోని ప్రాంతాల ప్రత్యేక అవసరాలను గుర్తించి బ్యాంకింగ్ సేవలను విస్తరించాలని ఆయన సూచించారు. 'క్యూర్, ప్యూర్, రేర్' ప్రాంతాల అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక బ్యాంకింగ్ వ్యూహాలను రూపొందించాలని కోరారు. తెలంగాణ అభివృద్ధి లక్ష్యాలను సాధించడంలో బ్యాంకింగ్ రంగం మరింత క్రియాశీలకంగా వ్యవహరించాలని, సమగ్ర ఆర్థిక వృద్ధి, సామాజిక సాధికారత, ఉపాధి కల్పనకు ఆర్థిక సంస్థలు బలమైన భాగస్వాములుగా నిలవాలని ఉప ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. ఈ సమావేశంలో ఆయా బ్యాంకులకు సంబంధించిన ప్రతినిధులు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

## వ్యవసాయ విశ్వవిద్యాలయ ఉద్యోగులకు విశ్వవిద్యాలయం ద్వారానే జీతాలు





**ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా ఆరోగ్య కార్డు సౌకర్యం కల్పించాలి**

**రాజేంద్రనగర్, విశాల భారతి:**

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉద్యోగుల జీతాల చెల్లింపును యథావిధిగా విశ్వవిద్యాలయం ద్వారానే కొనసాగించాలని, బోధనా, బోధనేతర ఉద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా ఆరోగ్య కార్డు సౌకర్యం కల్పించాలని తెలంగాణ వ్యవసాయ సిబ్బంది సంఘం, బోధనేతర ఉద్యోగుల సంఘం డిమాండ్ చేశాయి. ఈ మేరకు సంఘాల ప్రతినిధులు తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కేంద్ర సంఘానికి వినతిపత్రం సమర్పించారు. ఉద్యోగుల సమస్యలను తెలంగాణ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వారి ప్రయోజనాలను కాపాడేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం స్వయం ప్రతిపత్తి కలిగిన వ్యవసాయ విశ్వవిద్యాలయమని, ప్రత్యేక పరిపాలనా, ఆర్థిక వ్యవస్థలను కలిగి ఉందని సంఘాల ప్రతినిధులు తెలిపారు. ప్రస్తుతం విశ్వవిద్యాలయం ద్వారానే ఉద్యోగులకు జీతాలు చెల్లిస్తున్నారని, ఈ విధానాన్ని మార్చి ప్రభుత్వ ఖజానా ద్వారా జీతాలు చెల్లించే విధానాన్ని అమలు చేస్తే ఉద్యోగులకు పలు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. ముఖ్యంగా జీతాలకు సంబంధించిన ఎస్ఎల్ఎస్ బిల్లులు, అదనపు బిల్లులు, రుణాలు, ముందస్తు చెల్లింపులు, వివిధ భత్యాలు తదితర సేవా సంబంధిత ఆర్థిక అంశాల్లో సమస్యలు తలెత్తే అవకాశం ఉందని తెలిపారు. అందువల్ల ప్రస్తుతం అమలులో ఉన్న విశ్వవిద్యాలయం ద్వారా జీతాల చెల్లింపు విధానాన్నే కొనసాగించాలని కోరారు. అదేవిధంగా తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులకు అందుతున్న ఆరోగ్య కార్డు సౌకర్యాన్ని వ్యవసాయ విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న బోధనా, బోధనేతర ఉద్యోగులకు కూడా కల్పించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులతో పాటు అర్హత కలిగిన ఆధారిత కుటుంబ సభ్యులకు కూడా ఈ సౌకర్యాన్ని వర్తింపజేయాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కేంద్ర సంఘం ఈ అంశాలపై ప్రభుత్వంతో చర్చించి, విశ్వవిద్యాలయం ద్వారానే జీతాల చెల్లింపు కొనసాగించేలా, ఉద్యోగులకు ఆరోగ్య కార్డు సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ సిబ్బంది సంఘం, బోధనేతర ఉద్యోగుల సంఘం ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు.

## కేటీపీఎస్‌లో ఉద్యోగాల పేరుతో మోసం?

**నిరుద్యోగుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుంటున్నారంటూ ఆరోపణలు.. విచారణ చేపట్టాలని డిమాండ్**

**పాల్వంచ విశాల భారతి:** కటీపీఎస్ (KTPS) లో ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ నిరుద్యోగులు, అమాయక ప్రజలను నమ్మించి మోసాలకు పాల్పడుతున్నారంటూ అబ్దుల్ రవూఫ్ అనే వ్యక్తిపై పలువురు ఆరోపణలు చేస్తున్నారు. ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగుల అవసరాన్ని ఆసరాగా చేసుకుని డబ్బులు వసూలు చేస్తున్నారంటూ బాధితులు, స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగం వస్తుందనే ఆశతో కొందరు తమ వద్ద ఉన్న డబ్బును ఇచ్చి ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి, ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పాల్వంచ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. నిరుద్యోగుల ఆశలను ఆసరాగా చేసుకుని ఉద్యోగాల పేరుతో మోసాలకు పాల్పడే వ్యక్తులపై అధికారులు కఠినంగా వ్యవహరించాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. అధికారులు ఈ ఆరోపణలపై సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.




## కేసి తండా అభివృద్ధికి ఎస్టి సబ్ ప్లాన్ నిధులు మంజూరు చేయాలి

- **ఎమ్మెల్యే మల్ రంగారెడ్డికి వినతి పత్రం అందజేత**
- **కేసి తండా సర్పంచ్ జరుపుల రమేష్ నాయక్**



**విశాల భారతి ఇబ్రహీంపట్నం :** యాచారం మండల పరిధిలోని కేసీ తండా గ్రామ పంచాయతీ అభివృద్ధికి సహకరించి, గ్రామంలోని ప్రధాన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మాల్‌రెడ్డి రంగారెడ్డికి సర్పంచ్ జర్పుల రమేష్‌నాయక్ వినతిపత్రం అందజేశారు. మారుమూల గిరిజన ప్రాంతమైన కేసీ తండా అభివృద్ధికి ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు మంజూరు చేయాలని, గ్రామంలోని డ్రైనేజీ సమస్యలు తీర్చి సీసీ రోడ్లు నిర్మించాలని ఎమ్మెల్యేను కోరారు. అలాగే గ్రామంలో ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలపై సంబంధిత అధికారులతో మాట్లాడి మరమ్మతులు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే మల్ రంగారెడ్డి, ప్రతి ఒక్క పనిని పూర్తి చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారని సర్పంచ్ తెలిపారు. పనులు వేగవంతం కాకపోతే మళ్లీ ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌లో కలుస్తామని చెప్పారు. గ్రామాభివృద్ధిని దృష్టిలో ఉంచుకునే ఈ లేఖ ఇచ్చామని, నిధులు రాకపోతే గ్రామాభివృద్ధి ఆగిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, యువకులు, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## సీఈఐఆర్ పోర్టల్‌తో 25 పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు రికవరీ

- **బాధితులకు మొబైల్ ఫోన్లు అందజేసిన అత్తాపూర్ పోలీసులు**




**రాజేంద్రనగర్, విశాల భారతి:** పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను గుర్తించి తిరిగి బాధితులకు అందించడంలో అత్తాపూర్ పోలీసులు చొరవ చూపారు. కేంద్ర ప్రభుత్వ సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ పోర్టల్ సహాయంతో సుమారు రూ.2 లక్షల విలువైన 25 సెల్‌ఫోన్లను పోలీసులు రికవరీ చేశారు. బుధవారం అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో బాధితులకు ఆయా సెల్‌ఫోన్లను అందజేశారు. అత్తాపూర్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎ. సీతయ్య బాధితులను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి, తగిన ఆధారాలను పరిశీలించిన అనంతరం వారి సెల్‌ఫోన్లను అందజేశారు. పోయాయని భావించిన తమ విలువైన ఫోన్లు తిరిగి లభించడంతో బాధితులు ఆనందం వ్యక్తం చేశారు. పోలీసులకు, నేరాల దర్యాప్తు బృందం సిబ్బందికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ సీతయ్య మాట్లాడుతూ ఎవరైనా సెల్‌ఫోన్ పోగొట్టుకున్నా లేదా దొంగతనానికి గురైనా ఆందోళన చెందకుండా వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ సీఈఐఆర్ పోర్టల్‌లో సెల్‌ఫోన్ గుర్తింపు సంఖ్యను నమోదు చేసి ఫోన్‌ను నిలిపివేయడం ద్వారా దుర్వినియోగాన్ని అరికట్టవచ్చని తెలిపారు. అంతేకాకుండా ఫోన్‌ను గుర్తించి తిరిగి రికవరీ చేసేందుకు ఈ విధానం ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. ప్రజలు తమ సెల్‌ఫోన్లను జాగ్రత్తగా ఉంచుకోవడంతో పాటు ఫోన్ పోయిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఇన్‌స్పెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో అత్తాపూర్ పోలీస్ స్టేషన్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ రాజు నాయక్‌తో పాటు క్రైమ్ టీం సిబ్బంది బృందం పాల్గొన్నారు.

## పోలెశివ ఆకాల మరణం చాలాబాధాకరం

- **పోలె శివ కుటుంబానికి అండగా ఉంటాం**
- **మానవత్వం చాటిన చిన్ననాటి స్నేహితులు**
- **2002-23ఎస్ ఎస్ సి బ్యాచ్ .. 60వేల రూపాయలు ఆర్థిక సహాయం**



**విశాల భారతి ఇబ్రహీంపట్నం:** యాచారం మండల పరిధిలోని కొత్త పల్లి గ్రామానికి చెందిన 10 వార్డ్ మెంబెర్ పోలె శివ రోడ్డు ప్రమాదంలో మరణించిన విషయం తెలిసిందే. 200223 పదవ తరగతి పూర్వ స్నేహితులు బుధవారం పోలె శివ కుటుంబాన్ని పరామర్శించి,కుటుంబ సభ్యులకు ధైర్యంగా ఉండాలని, స్నేహితులందరూ వారి కుటంబానికి ఎల్లపుడు అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని తెలిపి, స్నేహితులందరూ కలిసి 60 వేల రూపాయలు ఆర్థిక సహాయం పోలె శివ కుటుంబ సభ్యులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో మొరుగు రమేష్, సంఘం రాజు,దంతుక రమేష్,గండికోట శ్రీనివాస్, రుద్రపల్లి బాలు, తాండ్ర మహేష్,జోగు పాండు, వరకుప్పల మహేష్, అండేకార్ భాష,ఆలూరి అర్జున్, పాశ్చ శ్రీశైలం,సూదిని వేణు గోపాల్ రెడ్డి,కట్టెల రాజు,గుండెల్లి రమేష్, కంబాలపల్లి శేఖర్, జక్కర్త మధుకర్,మండలి రమేష్, ఆలంపల్లి శివశంకర్, రేణుక, నిర్మల,అరుణ, బాలమణి,జంగమ్మ, సరస్వతి, విజయ, నాజియా బేగం, నుస్రత్ బేగం గ్రామ సర్పంచ్ చిక్కుడు వెన్నెల శేఖర్ ఉపసర్పంచ్ కాలే అనిత రమేష్ వార్డు సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## తాడిపర్తి గ్రామంలో సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన

**హైదరాబాద్ గ్రీన్ ఫార్మసిటీ సీఐ సత్యనారాయణ**




**విశాల భారతి ఇబ్రహీంపట్నం:** యాచారం మండలం హైదరాబాద్ గ్రీన్ ఫార్మా సిటీ పరిధిలోని తాటిపర్తి గ్రామంలో బుధవారం ఫార్మా సిటీ సీఐ సత్యనారాయణ, ఎస్ఐ సునీల్, సైబార్ నేరాల నియంత్రణపై అవగాహన నిర్వహించారు.ఈ సందర్భంగా సీఐ సత్యనారాయణ మాట్లాడుతూ గ్రామ ప్రజలు ఆన్ లైన్ మోసాలు,ఓటిపి మోసాలు,క్యూఆర్ కోడ్ మోసాలు,సోషల్ మీడియా భద్రత, వ్యక్తి గత సమాచారం,అపరచితుల నుండి వచ్చే సందేశాలు, ఇలాంటివి ప్రజలు నమ్మవద్దని గ్రామ ప్రజలకు వివరించారు.ఎవరైనా అనుమాస్పదా వ్యకులు కనిపించిన 112 నెంబర్ కు ఫోన్ చేయాలని తెలిపారు. అలాగే గ్రామంలో చదువుకుంటున్న విద్యార్థులు, యువకులు, డ్రగ్స్ కు, బానిస అవుతున్నారని, అన్నారు.గ్రామంలో యువత డ్రగ్స్, చెడు వ్యాసనాలకు అలవాటుపడితే గ్రామం, మండలం, జిల్లా, రాష్ట్రము, దేశమే చెడిపోతుందని గ్రామస్తులకు తెలిపారు.అలాంటి, విద్యార్థులు, యువకులు ఉంటే ముందస్తు సమాచారం పోలీస్ ఆదికారులకు ఇవ్వాలని కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నీలం ఝాన్సీ రమేష్, వార్డ్ మెంబెర్స్ గ్రామస్తులు పాల్గొన్నారు.



## ఈడీ విచారణకు హాజరైన

# నిధి అగర్వాల్!

అక్రమ ఆన్‌లైన్ బెట్టింగ్ అప్లికేషన్ల ప్రమోషన్ వ్యవహారం టాలీవుడ్‌లో ఇంకా కలకలం రేపుతునే ఉంది. తాజాగా ఈ కేసులో ప్రముఖ నటి నిధి అగర్వాల్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ED) అధికారులు విచారించారు. బెట్టింగ్ యాప్‌లను ప్రచారం చేసిన కేసులో భాగంగా మనీలాండరింగ్ ఆరోపణలపై బుధవారం హైదరాబాద్‌లోని ఈడీ ప్రాంతీయ కార్యాలయంలో ఈ విచారణ కొనసాగింది.విచారణ వివరాల ప్రకారం.. ఈడీ అధికారులు జారీ చేసిన నోటీసులకు స్పందించి నటి స్వయంగా విచారణకు హాజరయ్యారు. ఈ సందర్భంగా బెట్టింగ్ ప్లాట్‌ఫామ్‌లతో ఆమె కుదుర్చుకున్న ఒప్పందాలు, ప్రచార కార్యక్రమాలకు తీసుకున్న భారీ పారితోషికం, ఆర్థిక లావాదేవీల తీరుతెన్నులపై అధికారులు సుదీర్ఘంగా ప్రశ్నించినట్లు సమాచారం. ముఖ్యంగా ఈ చెల్లింపులు ఏయే మార్గాల ద్వారా జరిగాయి? హవాలా రూపంలో నగదు బదిలీ జరిగిందా అనే కోణంలో ఈడీ అధికారులు కూపీ లాగుతున్నారు.తెలంగాణ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఈ బెట్టింగ్ యాప్‌ల కేసులో ఇప్పటికే దాదాపు 21 మంది సినీ ప్రముఖులు, సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్ల ప్రమేయం ఉన్నట్లు అధికారులు గుర్తించారు. దీనిలో భాగంగానే కొద్ది రోజుల క్రితం తెలంగాణ సీఐడీ ఎదుట కూడా నిధి అగర్వాల్ హాజరై తన వాంగ్మూలాన్ని సమర్పించారు. ప్రస్తుతం మనీలాండరింగ్ నిరోధక చట్టం (PMLA) కింద కేసు నమోదు చేసిన ఈడీ, ఆర్థిక లావాదేవీలపై దర్యాప్తును మరింత వేగవంతం చేసింది.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.